మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 63 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## జవాన్లు రోజువారీ కూలీలు కాదు



3లో..

# దేశంలో నిరంకుశ పాలన!

- మేమంతా మోదీ సిద్ధాంతాలకు వ్యతిరేకం
- తక్కువస్థానాల్లో పోటీ వ్యూహంలో భాగమే..
- దేశంలో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అణిచివేస్తోంది
- రాహుల్, ప్రియాంకలే మా ఆస్తులు:ఖర్గే



**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** ఇండియా కూటమిని కలిసికట్టుగా ఉంచి, బీజేపీని ఓడించే వ్యూహంలో భాగంగానే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తక్కువ సీట్లలో పోటీ చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. పలు ప్రాంతాల్లో బలంగా ఉన్న ఇతర పార్టీలకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీని పార్టీ ఆస్తిగా అభివర్ణించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖర్గే పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."ప్రియాంక గాంధీ కాంగ్రెస్ పార్టీ ఆస్తి. అలాగే స్టార్ క్యాంపెయినర్ కూడా. ఆమె ఈ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే ప్రియాంక గాంధీ నిర్ణయాన్ని సమర్థిస్తున్నా. సోనియా గాంధీ 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలో ఆమెకు బాగా తెలుసు. సోనియా గాంధీకి ఆరోగ్యం బాగా లేదు. ప్రియాంక గాంధీ, రాహుల్ మా పార్టీ ఆస్తులు, స్టార్ క్యాంపెయినర్లు. వారి ప్రసంగాలు వినడానికి వేలాది మంది ప్రజలు వస్తారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తక్కువ సీట్లలో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను కలిసికట్టుగా ఉంచడానికే తక్కువ సీట్లలో పోటీ చేస్తున్నాం. అందుకే మేము రాజీ పడ్డాం. భావ సారూప్యత గల పార్టీలతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రతి రాష్ట్రంలోనూ పొత్తులను పెట్టుకునేందుకు కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసింది. కేరళ, బంగాల్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఇండియా కూటమి పార్టీల మధ్య పోటీ నెలకొంది. అయితే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడంలో ఎటువంటి ఇబ్బంది లేదు. ప్రతి రాష్ట్రానికి భిన్నమైన కూటమి ఉంటుంది. అయితే మేమంతా బీజేపీ, మోదీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. దేశ ప్రయోజనాల కోసమే కూటమిగా ఏర్పడ్డాం. వయనాడ్, రాయ్ బరేలి రెండింటిలోనూ గెలిస్తే రాహుల్ ఏ సీటును నిలబెట్టుకుంటారో ఆయన వ్యక్తిగత నిర్ణయం" అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి రాకుండా ఇండియా కూటమి ఆపగలదని మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ఇండియా కూటమి ఈ ఎన్నికల్లో మెజారిటీ మార్క్ ను అందుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు."కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే చట్టాలన్నింటినీ సమీక్షిస్తాం. ప్రజలను ఇబ్బంది పెట్టే ఏ చట్టాన్నైనా వ్యతిరేకిస్తాం. బీజేపీలా దర్యాప్తు సంస్థలను ఇప్పటివరకు ఏ పార్టీ దుర్వినియోగం చేయలేదు. దర్యాప్తు సంస్థలు సోదాలు జరపడం తప్పు కాదు. కేసులపై సరైన విచారణ జరపాలి. కానీ బీజేపీ తప్పుడు కేసులు సృష్టించి ప్రజలను కటకటాలపాలజేస్తోంది. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతలను బీజేపీ ఎందుకు జైలుకు పంపిస్తోంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్నా అప్పుడు ఎందుకు విపక్ష నేతలను అరెస్టు చేయలేదు? ఎన్నికలప్పుడే ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు? ప్రతిపక్ష నేతలపై బెదిరింపులు, వేధింపులకు దిగుతున్నారు. ప్రచారానికి కూడా వారిని వదిలిపెట్టలేదు. ప్రజాస్వామ్యానికి ఇలాంటివి మంచిది కాదు. దేశంలో నిరంకుశ పాలన అమలవుతోంది" కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తోందని, అలాగే రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తోందని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయడానికి సీనియర్ నాయకులు అవసరమని, అందుకే కొందరిని ఎన్నికల బరిలో నిలపలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాలను గెలిపించుకునేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు.

# సన్న ధాన్యం ప్రోత్సాహం కోసమే రూ.500 బోనస్

- మా సర్కారే రైతుల పక్షపాతి
- బీఆర్ఎస్ అబద్ధాల ప్రచారం మానాలి
- గత ప్రభుత్వం కన్నా మెరుగ్గా కొనుగోళ్లు చేస్తున్నాం
- ఆనాడు వరికుప్పలపైనే రైతులు ప్రాణాలొదిలారు
- ఇప్పుడు ధైర్యంగా పంటలు అమ్ముకుంటున్నారు
- ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు లేకుండా రైతులకు మద్దతు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణ వేయి పాళ్లునయమని, ఇది తెలంగాణ రైతుల అభిప్రాయం అనివ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసామని, చురుకుగా కొనుగోళ్లు సాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు 500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్ళు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో

మిగతా 2లో..

# ప్రధాన పార్టీల తీరుపై ఈసీ ఆగ్రహం

- కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులకు నోటీసులు




**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో నిమగ్నమైన ప్రధాన రాజకీయ పార్టీలు.. విమర్శనాస్త్రాలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో అగ్ర నేతలు, ముఖ్య ప్రచారకర్తలు చేసే ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపైనా విరుచుకుపడింది. నేతల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని పేర్కొంటూ భాజపా, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు నోటీసులు జారీ చేసింది.ఎన్నికల ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని భాజపా, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను వెంటనే ఆపాలని భాజపాకు స్పష్టం చేసింది. రాజ్యాంగం రద్దవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రకటనలకు దూరంగా

మిగతా 2లో..

## మమత సర్కార్‌కు ఎదురుదెబ్బ

- 2010 తరవాత జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్ల రద్దు
- కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు
- తీర్పును అంగీకరించమన్న మమతా బెనర్జీ



**కోల్‌కతా (ప్రజా మంటలు):** లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. ఓబీసీలో పలు క్లాసులను కొట్టివేసింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 నాటి పశ్చిమ బెంగాల్

మిగతా 2లో..







# శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

-కాంగ్రెస్ పాలనలో సంతోషంగా రాష్ట్ర రైతులు - ఏపీలో ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు కోరుకుంటున్నా - ఇరు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని దేవుడిని కోరుకున్నా.. - కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్న సీఎం రేవంత్

**తిరుమల (ప్రజా మంటలు):** ఏపీలో ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తితిదే ఈవో ఏవీ ధర్మారెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తితిదే ఈవో ఏవీ ధర్మారెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రేవంత్ రెడ్డి ఉదయం శ్రీవారికి తన మనవడి పుట్టువెంట్రుకల మొక్కు చెల్లించారు. అనంతరం ఉదయం 8.30గంటలకు వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.స్వామివారిని దర్శించుకున్న అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర రైతులు సంతోషంగా ఉన్నారు. రాష్ట్రంలో నీటి సమస్యలు తీరి సకాలంలో వర్షాలు కురిశాయి. ఏపీలో ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నా. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించా. స్వామి వారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి" అని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.


## ప్రజ్వల్ వెంటనే స్వదేశానికి వచ్చేయ్

- చట్టబద్ధంగా కేసులు ఎదుర్కోవాల్సిందే..
- మాజీ సిఎం కుమారస్వామి వినతి



**బెంగళూరు (ప్రజా మంటలు):** వీలైనంత త్వరగా భారత్‌కు వచ్చి పోలీసులకు లొంగిపోవాలని లైంగిక దౌర్జన్యాల కేసులో కీలక నిందితుడు, ఎంపీ ప్రజ్వల్‌కు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. విదేశాల నుంచి వచ్చి విచారణను ఎదుర్కోవాలని కోరారు. ప్రజ్వల్ రేవణ్ణపై ఆరోపణల విషయంలో తమ పార్టీకి, భాజపాకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. ఈ కేసుకు పొత్తుకు ఎలాంటి సంబంధం లేదని ఆయన చెప్పారు. ప్రజ్వల్ ఏప్రిల్ 27న దౌత్యపరమైన పాస్‌పోర్టుతో జర్మనీకి వెళ్లినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. హాసన్ నియోజకవర్గ ఎన్నికలు జరిగిన మరునాడు విదేశాలకు వెళ్లిన ప్రజ్వల్ ఇంకా పరారీలోనే ఉన్నారు. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, ఎమ్మెల్యే రేవణ్ణపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసింది. ఈ కేసు విచారణకు హాజరుకావాలని వీరిద్దరికీ సిట్ ఇప్పటికే

## ప్రజా నాడి




# అగ్నిపథ్ సైన్యం పథకం కాదు.. మోడీ పథకం

- అధికారం ఇవ్వండి.. అగ్నిపథ్ రద్దు చేస్తాం
- జవాన్లు (అగ్నివీర్లు) రోజువారీ కూలీలు కాదు..!
- దేశ రక్షణను భాజపా ప్రమాదంలోకి నెట్టింది
- హర్యాన ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- రైతుల సమస్యలపై ప్రధాని మోడీ వైఖరిపై ఆగ్రహం



**చంఢీగడ్, మే 22 (ప్రజా మంటలు):** ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేసి చెత్తకుండీలో పడేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి స్పష్టం చేశారు. దేశ యువతను కూలీలుగా మార్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నివీర్ పథకంపై బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ ఇది సైన్యం పథకం కాదని, ఇది మోడీ పథకమని ఆయన ఆరోపించారు. అగ్నివీర్ ఫథకాన్ని సైన్యం కోరుకోవడం లేదని ఆయన తెలిపారు. భారతదేశ సరిహద్దులు దేశ యువత చేతుల్లో భద్రంగా ఉన్నాయని, మన యువత డిఎన్ఎలోనే దేశభక్తి ఉందని ఆయన అన్నారు. భారతదేశ యువతను కూలీలుగా మోడీ మార్చివేశారని ఆయన ఆరోపించారు. హర్యానాలో తన తొలి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని మహేంద్రగఢ్‌లో ప్రారంభించిన రాహుల్ గాంధీ రైతుల సమస్యపై ప్రధాని మోడీ వైఖరిని ఎండగట్టారు. రెండు రకాల అమర జవాన్లు ఉంటారని మన ప్రభుత్వం చెబుతోందని, ఒకరు సాధారణ జవాన్ అయితే మరొకరు పెన్షన్, అమర వీరుని హోదా, ఇతర అన్ని సౌకర్యాలు లభించే అధికారి అని రాహుల్ చెప్పారు. అగ్నివీర్ పేరుతో సైన్యంలోకి వచ్చే పేద కుటుంబానికి చెందిన వ్యక్తి మరణిస్తే అమర వీరుని హోదా కాని, పెన్షన్ కాని రావని, కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా ఉండదని ఆయన తెలిపారు.

**రైతులు కష్టం తెలియదా?**

హరియాణ రైతులు పొలాల్లో కష్టపడుతున్నారని, కానీ మోదీ ప్రభుత్వం బిలియనీర్లకు సాయం చేసేలా ల్యాండ్ ట్రిబ్యునల్ బిల్‌ను రద్దుచేసి రైతుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. మూడు వ్యవసాయ బిల్లులను తీసుకువచ్చిందని, దీనిపై భారత్ జోడో యాత్రలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మీడియాలో ఎక్కడా కనిపించలేదని అన్నారు. 22 మంది కోటీశ్వరులకు చెందిన రూ. 16 లక్షల కోట్ల రుణాలను మోడీ ప్రభుత్వం మాఫీ చేసిందని ఆయన ఆరోపించారు. జూన్ 4న తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల రుణాలను మాఫీ చేస్తామని ఆయన ప్రకటించారు. వ్యవసాయ రుణ మాఫీకి సంబంధించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రుణ మాఫీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన వాగ్దానం చేశారు. వేల కిలోమీటర్ల మేర 'భారత్ జోడో యాత్ర' చేశాను,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## సన్న ధాన్యం ప్రోత్సాహం కోసమే రూ.500 బోనస్

రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుంది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇకపోతే ఐకేపీ సెంటర్ల పెంపు గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసామని, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్ ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయిస్తున్నా మన్నారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవు.. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ.. ఈ దఫా మిల్లర్ల దోపిడీ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కోతలకు మిల్లర్ల స్వస్తి చెప్పారని అన్నారు. దీంతో ప్రతి కింటా పై రైతుకు 150 నుంచి 200 రూపాయల వరకు అదనపు లబ్ది చేకూర్చామన్నారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని, గతంలో 45 రోజులు పెట్టేదన్నారు. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుంది దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు. వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదు. ఆత్మగౌరవంతో ఇప్పుడు రైతు బతుకుతున్నాడని, కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేదన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అందిస్తోందన్నారు. అంతే గాక, ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా, ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి పంట భీమా పథకాన్ని 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వానాకాలం నుండి అమలు చేస్తున్నామన్నారు. అలాగే తడిచిన ధాన్యాన్ని సైతం ఈ ప్రభుత్వం సేకరిస్తుంది. గతంలో కల్లాల్లో వరికుప్పలమీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కానీ మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారు. అందుకే మనం దొడ్డు వడ్లు అమ్ముకొనుడెంది, సన్న వడ్లు కొనుక్కునుడేంది.. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టాము. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుంది కాబట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టాం. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తాము. దొడ్డు వడ్లకు 500 రూపాయలు ఇప్పుడు ఇవ్వలేకపోయినా?మూడు నుంచి ఐదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడుతూ.. ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ది చేకూరుస్తోంది. అది తెలుసు కనుకనే తెలంగాణ రైతులు నిశ్చింతగా ఉన్నారు. రైతులను కాల్చుకుతిన్న టిఆర్ఎస్ అగ్ర నాయకులు ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కెసిఆర్ ప్రకటించారు. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదు అందుకే కేసిఆర్ ను ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారు. అన్నదాతలార ఆలోచించండి..ఇది ప్రజా ప్రభుత్వం. ఎక్కడ దుబార చేయకుండా.. కెసిఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. త్వరలో అన్ని హామీలను నిలబెట్టుకుంటాం. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు పక్రియను ప్రారంభిస్తామని చెప్పాము. ప్రారంభించి చూపించాం. వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతాం. లేకుంటే ఓట్లే అడగం, ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రకటనలు ఆపుకోవాలని తుమ్మల నాగేశ్వర రావు హితవు పలికారు.

## ప్రధాన పార్టీల తీరుపై ఈసీ ఆగ్రహం

ఉండాలని కాంగ్రెస్‌ను ఆదేశించింది. అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు.. సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని పేర్కొంది. భాజపా, కాంగ్రెస్‌లు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, వాటిని సమర్థించుకోవడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ మరింత బాధ్యతగా వ్యవహరించాలన్న ఈసీ.. ప్రతిపక్ష పార్టీకీ ఈ విషయంలో మినహాయింపు లేదని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థపై భారత ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఈసీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టంచేసింది. ఈ క్రమంలోనే ప్రచారాల్లో సంయమనం పాటించి, ప్రసంగాలను సరిచేసుకునేలా స్టార్ క్యాంపెయినర్లకు సూచించుకోవాలని రెండు జాతీయ పార్టీలకు ఈసీ సూచించింది.

## మమత సర్కార్‌కు ఎదురుదెబ్బ

వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నిం టిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. 1993లో చేసిన చట్టానికి విరుద్ధంగా పత్రాలు జారీ చేశారని న్యాయమూర్తులు తపబ్రత చక్రవర్తి, రాజశేఖర్ మంతాతో కూడిన హైకోర్టు ధర్మాసనం తమ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, తమ ఉత్తర్వుల ప్రభావం ఇప్పటికే ఉద్యోగాలు, పథకాల లబ్ధి పొందిన వారిపై ఎటువంటి ప్రభావం చూపవని తెలిపింది. 2010కి ముందు 66 తరగతులుగా క్లాసిఫై చేసిన ఓబీసీల జోలికి తాము వెళ్లడం లేదని, పిటిషన్‌లో వాటిని సవాలు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఇప్పుడు భాజపా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నింది. ఈ తీర్పును మేం అంగీకరింబోం. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయని దీదీ స్పష్టంచేశారు.

## ప్రజ్వల్ వెంటనే స్వదేశానికి వచ్చేయ్

నోటీసులు జారీ చేసింది. అందుకు వారం రోజుల సమయం కావాలని ప్రజ్వల్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన దర్యాప్తు బృందం ఆయనపై లుక్‌అవుట్ నోటీసు జారీ చేసింది. దీంతో ప్రజ్వల్ దేశంలో అడుగుపెట్టగానే పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రజ్వల్‌ను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారా అని మీడియా అడిగిన ప్రశ్నకు కుమారస్వామి మాట్లాడుతూ అతడు కర్ణాటకలో ఉన్నప్పుడే నా దగ్గరికి ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు విదేశాల్లో ఉండి నాతో మాట్లాడతాడా. నేను ఇప్పటికే నాపైనా, హెచ్‌డీ దేవేగౌడపైన గౌరవం ఉంటే 48 గంటల్లోగా పోలీసుల ముందు లొంగిపోవాలని, విచారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశాను. ఇప్పటికైనా లొంగిపోవాలని మళ్లీ ప్రజ్వల్‌ను కోరుతున్నాను. నా మాటను గౌరవించి ప్రజ్వల్ తిరిగి వస్తాడని ఆశిస్తున్నాను. ప్రస్తుతం ప్రజ్వల్ ఎక్కడ ఉన్నాడో అతడి తండ్రి హెచ్‌డీ రేవణ్ణకు కూడా తెలియదు. ఎవరితోనూ కాంటాక్ట్‌లో లేడు. కొందరు న్యాయవాదుల సలహాతో విదేశాలకు వెళ్లాడని తెలిసిందని అన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల పక్రియ పూర్తయిన తర్వాత ప్రజ్వల్ ఎవరికీ చెప్పకుండా విదేశాలకు వెళ్లాడని తెలిపారు. ఒక వారంలో వచ్చి విచారణకు హాజరవుతానని ప్రకటించిన అనంతరం అతనిపై అత్యాచారం కేసు నమోదు చేయడంతో భారత్‌కు వచ్చేందుకు వెనకడుగువేసి ఉండవచ్చని పేర్కొన్నారు. కొందరు వ్యాపారవేత్తలు ప్రజ్వల్‌కు సహాయం చేస్తున్నారనే వార్తలపై కుమారస్వామి స్పందిస్తూ తనకు ఆ విషయం గురించి తెలియదన్నారు. తమ కష్టాలు పంచుకోవడానికి ప్రజలు తప్ప తన వద్దకు ఏ వ్యాపారవేత్త రారని అన్నారు. ఇలాంటి కేసులతో దేవెగౌడ కుటుంబాన్ని రాజకీయంగా అంతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

# జవాన్లు రోజువారీ కూలీలు కాదు

**- దేశరక్షణను భాజపా ప్రమాదంలోకి నెట్టింది - ఇండియా కూటమికి అధికారమిస్తే జన్‌ధన్ ఖాతాలు కట్- మీ నగదును బదిలీ చేసేసుకుంటారు- విపక్ష కూటమి క్యాన్సర్ కన్నా డేంజర్**

**- యూపీ ప్రచారంలో ప్రధాని మోడీ హెచ్చరిక**

**లక్నో (ప్రజా మంటలు):** ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే జనధన్ బ్యాంక్ ఖాతాలు మూసి వేసి అందులోని నగదు లాగేసుకొంటాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ప్రభుత్వ హయాంలో పేదవారి కోసం దాదాపు 50 కోట్లకు పైగా జనధన్ యోజన ఖాతాలను ప్రారంభించానని తెలిపారు. బుధవారం ఉత్తరప్రదేశ్ లోని శ్రావస్థిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆ ఖాతాలన్నీ ప్రతిపక్షాలు మూసి వేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశాయి. ప్రధానిగా తాను దేశంలో ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా తీసుకు వచ్చానన్నారు. అదే ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మాత్రం ఆ యా గ్రామాలన్నీ విద్యుత్ కోతల ద్వారా చీకటిలోకి నెట్టేస్తాయని విమర్శించారు. ఇక ప్రతీ ఇంటికి తాను కుళాయి ద్వారా నీళు అందించానని గుర్తు చేశారు. అయితే ఇంటికి దూరంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేయ గల నైపుణ్యంలో ప్రతిపక్షాలు పేరు సంపాదించాయని చెప్పారు. ఇక 4 కోట్ల మంది పేద ప్రజలకు కోసం నిర్మించిన ఇళ్లు.. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేసినా.. దానికి విరుద్ధంగా చేయడం ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యేకత అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాదిస్తే.. ప్రస్తుతం జైల్లో ఉన్న తీవ్రవాదులందరని.. ప్రధానమంత్రి తన నివాసంలో బిర్యానీ తినేందుకు ఆహ్వానిస్తారన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యంగ్య బాణాలు సంధించారు. వీరిద్దరు పాల్గొంటున్న బహిరంగ సభలకు భారీగా జనం తరలివచ్చిన కొన్ని వీడియోలను తాను చూశానని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సభలకు హాజరయ్యేందుకు ఈ రెండు పార్టీలు ప్రజలకు నగదు పంచి పెడుతున్నాయని.. అందుకే వారంతా వస్తున్నారని మోదీ విమర్శించారు. ప్రజలకు నగదు ఇవ్వకుండా ర్యాలీలకు తీసుకు రావాలని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు ప్రధాని మోదీ సూచించారు. అయితే వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే.. వారు మీ కోసం ఏం పని చేస్తారంటూ ప్రజలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రశ్నించారు. అలాగే విపక్ష ఇండియా కూటమి క్యాన్సర్ కంటే ప్రమాదకారి అని, అది వ్యాపిస్తే దేశాన్నే నాశనం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విపక్ష ఇండియా కూటమికి మతతత్వం, తీవ్ర జాతి వివక్ష, బంధుప్రీతి వంటి వ్యాధులున్నాయన్నారు. ఇవి క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన వ్యాధులన్నారు. మోదీ దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది పేదలకు ఇళ్ళు ఇచ్చారని, ఇప్పుడు సమాజ్‌వాది, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే అన్నింటినీ తారుమారు చేస్తారని హెచ్చరించారు. విపక్షాలు గెలిస్తే పేదలకు తాము నిర్మించిన ఇళ్లను గుంజుకుని వాటిని తమ ఓటు బ్యాంకుకు పంచివేస్తాయని ఆరోపించారు. తాను ప్రారంభించిన 50 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలను మూసివేసి ఆ డబ్బును వారు లాగేసుకుంటారని విమర్శించారు. మోడీ ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తే విపక్షాలు విద్యుత్ కనెక్షన్లను కట్ చేసి మళ్లీ చీకట్లోకి తీసుకువెళతాయన్నారు.

## కాంగ్రెస్సే కాదు.. సమాజ్‌వాదీ కూడా పాక్‌సానుభూతి పార్టీయేనట!

**- ప్రధాని సరికొత్త ఆరోపణ**

ప్రధాని మోదీకాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. వారు పాకిస్థాన్ సానుభూతిపరులంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ దేశ ప్రజలను భయపెట్టేందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) ఆరోపించారు. ఆ రెండు పార్టీలు పాక్‌కు సానుభూతిపరులు అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.2017లో యూపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి ప్రచారం చేసిన ఈ రెండు పార్టీలు (కాంగ్రెస్, ఎస్పీ) ఓటమి చవిచూశాయని.. ప్రస్తుతం మళ్లీ అవి కలిసి ప్రచారం చేయడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రధాని ఎద్దేవా చేశారు. “ఒకప్పుడు ఉగ్రవాదం పేరుతో మనల్ని బెదిరించినవారు ప్రస్తుతం ఆహార ధాన్యాల కోసం అల్లాడుతున్నారు. పాకిస్థాన్ పని అయిపోయింది. కానీ, ఆ దేశ సానుభూతిపరులైన ఎస్పీ, కాంగ్రెస్‌లు మాత్రం దేశాన్ని భయపెట్టే పనిలో బిజీగా ఉన్నాయి” అని మోదీ ఆరోపించారు.ఇది బలహీన ప్రభుత్వం కాదు.. మోదీ సర్కార్“పాక్ వద్ద అణు బాంబులున్నాయని మనం భయపడాలని వారు అంటున్నారు. ఈ 56 అంగుళాల ఛాతీ (మోదీని ఉద్దేశిస్తూ) గురించి వారికి తెలియదా? ఇది వారి బలహీన కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. బలమైన మోదీ సర్కార్. మనల్ని బెదిరించాలని ప్రయత్నించే వారిని భారత్ వదిలిపెట్టదు. వారి దేశంలోకి వెళ్లి మరీ వాళ్ల అంతు చూసింది” ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఈవీఎం ధ్వంసమైనా నష్టమేమీలేదు

**- పోలింగ్ డేటా భద్రంగానే ఉంది - ఘటనలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించాం**

**- కొత్త ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించాం - 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు పెట్టాం**

**- ఏడేళ్ల జైలు ఖాయమన్న సీఈవో ముఖేశ్ కుమార్ మీనా**

**అమరావతి,మే22 (ప్రజా మంటలు):** పోలింగ్ రోజున ఏపీలో మొత్తం 9 చోట్ల ఈవీఎంలు ధ్వంస మయ్యాయని.. మాచర్లలో 7 ఘటనలు చోటుచేసుకున్నట్లు సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈవీఎంలను ధ్వంసం చేశారు. ఘటనలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించాం. ఈవీఎం ధ్వంసం చేసినా డేటా భద్రంగా ఉంది. దీంతో కొత్త ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించామని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి సిట్‌కు పోలీసులు అన్ని వివరాలను అందించారు. 20న రెంటచింతల ఎస్ఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. మొదటి నిందితుడిగా పిన్నెల్లిని పేర్కొన్నారు. 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు పెట్టారు. ఏడేళ్ల వరకూ శిక్షలు పడే అవకాశం ఉంది. ఆయనను అరెస్టు చేయడానికి పోలీసు బృందాలు వెళ్లాయి. మిగతా చోట్ల కూడా కేసులు పెట్టి దర్యాప్తు చేస్తున్నాం. ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదు. ఈ ఘటన నమోదు అయిన సమయంలో ఈసీ ఆదేశాలతో బదిలీలు జరిగాయి. ఈవీఎం ధ్వంసం ఘటనలో మేమేమీ దాచిపెట్టలేదు. ఘటన జరిగిన మరుసటి రోజే ఆధారాలను పోలీసులకు అప్పగించాం అని సీఈవో స్పష్టం చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనను సిగ్గుమాలిన చర్యగా ఈసీ పేర్కొంది. ఇలాంటి ఘటనలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లో వైఫల్యంగా ఈసీ దీనిని గుర్తించిందని సీఈవో తెలిపారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని పీఎస్ నంబర్ 202తో పాటు 7 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. రాష్ట్ర ఎన్నికల అధికారికి నోటీసులు పంపింది. ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనపై వెంటనే వివరణ ఇవ్వాలని.. అలాగే ఈ ఘటనపై ఎమ్మెల్యే పిన్నెల్లి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే ఈ ఘటనపై సాయంత్రం ఐదు గంటల లోపు నివేదిక ఇవ్వాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ఈ ఘటనల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించాలని సీఈవో ముఖేష్ కుమార్ మీనాను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విషయంలో భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసం చేయకుండా కఠినంగా వ్యవహరించాలని ఈసీ ఆదేశించింది.

## అగ్నిపథ్ సైన్యం పథకం కాదు.. మోడీ పథకం

వెళ్ళిన ప్రతి చోట అక్కడ ప్రజలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. మోడీ రైతుల సమస్యలు, ఉద్యోగాలు గురించి మాట్లాడరని రాహుల్ ప్రధానిపై విమర్శలు చేశారు.

## సన్నాలకే బోనస్ సరికాదు

**- వర్షాలు పడతాయని హెచ్చరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో కదలని అధికారులు**

**- బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**సిద్దిపేట (ప్రజా మంటలు):** తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కల్లాల్లో పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారని చెప్పారు. ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తింది. ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని పేర్కొన్నరు. ఒక వేళ కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తరుగు లేకుండా వెంటనే వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు రైతులతో మాట్లాడినప్పుడు ఇంటి అవసరాలకు మాత్రమే సన్న వడ్లు పండిస్తామని, మిగతా వడ్లన్నీ దొడ్డువడ్లేనని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగయింది. 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి , కేవలం ఐదు శాతం సన్నబడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బోనస్ విషయంలో ఆలోచించి సన్నవడ్లకే కాకుండా దోడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకు లను రైతులు గ్రామాల్లో నిలదీస్తారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఫలితాలు వెలువడ్డ సత్వరమే ప్రధాని అభ్యర్థి ఎంపిక

**- మోదీ వ్యాఖ్యలకు జైరామ్ రమేశ్ కౌంటర్**

**న్యూఢిల్లీ (ప్రజా మంటలు):** ప్రధాని ఎవరన్నది వ్యక్తుల మధ్య బ్యూటీ కాంటెస్ట్ కాదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. జూన్ 4వ తేదీన ఎన్నికల తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే ప్రధానమంత్రి అభ్యర్థిని ఎన్నుకుంటామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ పై 'ఇండియా' కూటమి తరఫున ప్రధాని అభ్యర్థి ఎవరనే ప్రశ్నకు జైరామ్ రమేష్ బుధవారంనాడు ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ఇదేమీ వ్యక్తుల మధ్య 'బ్యూటీ కాంటెస్ట్' కాదన్నారు. ఏకాభిప్రాయంతోనే ప్రధానమంత్రిని 'ఇండియా' కూటమి ఎన్నుకుంటుందని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించిన మరుసటి రోజే జైరామ్ రమేష్ తాజా వ్యాఖ్యలు చేశారు. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడగానే 26 భాగస్వామ్య పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఏకాభిప్రాయంతో ప్రధానమంత్రిని ఎన్నుకుంటామని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. 2004లో యూపీఏ ప్రభుత్వం అనుసరించిన పక్రియనే తాము పాటిస్తామని చెప్పారు. 2004లో ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ పేరును ప్రకటించడానికి నాలుగు రోజులు పట్టిందని జైరామ్ రమేష్ తెలిపారు. ఈసారి రెండు రోజులకు మించి పట్టకపోవచ్చని, కొద్ది గంటల్లోనే పేరుపై నిర్ణయం ఉండొచ్చని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండొచ్చా అనే ప్రశ్నకు, అతిపెద్ద పార్టీ తరపు అభ్యర్థి ప్రధాని కావడం అనే ఫార్ములాను అనుసరించవచ్చన్నారు. 'ఇండియా' కూటమి ప్రధాని అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్లడంపై నరేంద్ర మోదీ ఇటీవల వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులకు విపక్ష కూటమి ఎ÷-లాన్ చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఆయన వాదనను మల్లికార్జున్ ఖర్గే తోసిపుచ్చారు. యూపీఏ కూడా గతంలో వివిధ పార్టీల కూటమిగా ఉందని, ఒకే ప్రధానితో ఐదేళ్ళు పాలన సాగించిందని గుర్తు చేసారు. యూపీఏ-1, యూపీఏ-2 హయంలో భాగస్వామ్య పార్టీల మద్దతుతో పూర్తి కాలం పాలన సాగించామన్నారు. 10 ఏళ్ల పాటు మన్మోహన్ సింగ్ దేశాన్ని పాలించారని చెప్పారు.

# ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లు కొనాల్సిందే

**- బోనస్‌తో వడ్లు కొనేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారు?**

**- ధాన్యం సేకరణకు కేంద్రం సిద్ధంగా ఉంది**

**- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద (ప్రజా మంటలు):** రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు రైతులను మోసం చేస్తున్నారని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు ఆగస్టు 15లోగా అమలు చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. సన్న వడ్లకే బోనస్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని చెప్పారు. చాలా తక్కువ మంది రైతులే సన్న రకం పండిస్తారని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దొడ్డు వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. వాటిని కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటన్నారు. ఈ ప్రభుత్వం బోనస్ పేరుతో అన్నదాతలను మోసం చేసింది. కేంద్రం అన్ని రకాలుగా వారికి అండగా ఉంది. రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాలని కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. గతంలో భారాస, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయి. ధాన్యం తడిచి మొలకెత్తుతున్నా, కొనుగోలు కేంద్రాలకు తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌యార్డుల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం 75 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొనేందుకు మరో 2 నెలలు పడుతుంది. వర్షాలు పడి ధాన్యం మొలకలు వస్తుంటే బాధ్యులు ఎవరని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతులను మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి రైతుల్ని దగా చేసిందన్నారు. కౌలు రైతులకు 15 వేలు ఇస్తామని చెప్పారు? వరికి క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తామని చెప్పి యే ఒకటి కూడా అమలు చేసేలా లేదన్నారు. రైతులను నయవంచన చేసి అధికారం లోకి కాంగ్రెస్ వచ్చిందన్నారు. దేవుడి పేరుతో ఓట్లు పెడుతూ ప్రజలకి మాత్రం పంగనామాలు పెడుతుంది ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతుందన్నారు.చెయ్యి గుర్తుకు ఓటు వేసినందుకు రైతులకు చేయి ఇస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎంత ధాన్యం పండిన యే రకం అయినా కేంద్రం కొంటుంది? రైతులకు అండగా కేంద్రం ఉంటుంది? డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది .. దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఖరీఫ్ సీజన్ ది రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదన్నారు. రబీలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందం చేసుకుంటే 33 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది ఈ ప్రభుత్వం అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తిన ? కొనుగోలు మాత్రం నామ మాత్రంగా నత్తనడకన నడుస్తుంది?రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కోనుగులు చేసింది 75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అన్నారు. సోనియమ్మ రాజ్యం అంటే రైతుల కన్నీళ్లు చూడడమా అని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ధాన్యం ఎఫ్‌సిఐకి చేరే వరకు అయ్యే ఖర్చు మొత్తం భరుస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా కూడా భారం కూడా పడదు? ఇంకా కమిషన్ ఇస్తుంది కేంద్రం? కమిషన్ డబ్బులతో నే ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. దొడ్డు రకం వేస్తే అడ్డుకుంటామని సీఎం అంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఎందుకు బోనస్ చెల్లించడం లేదో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. మీ గారెంటీలు గారడీలు కాకుంటే తెలంగాణ ఓట్ల మీద మీకు గౌరవం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.




# 5 ట్రిలియన్ డాలర్లు.. బీఎస్ఈ కంపెనీల మార్కెట్

## క్యాప్ విలువ మరింత పెరుగుతుందంటున్న ఎనలిస్టులు

ముంబై: మెటల్ స్టాక్స్, పవర్, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్‌లలో బలమైన ర్యాలీ తర్వాత, మంగళవారం ఇంట్రాడే డీల్స్‌లో బీ?ఎస్?ఈ- లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మొదటిసారిగా 5 ట్రిలియన్ల డాలర్లకు (దాదాపు రూ.41.65 కోట్ల కోట్లు) చేరుకుంది.

# దుబాయ్ లాటరీలో భారతీయ మహిళకు జాక్‌పాట్..!

**రూ. 8.3 కోట్లు గెలుచుకున్న పంజాబ్‌కు చెందిన పాయల్**

**పెళ్లిరోజు కానుకగా భర్త ఇచ్చిన నగదు బహుమతితో లాటరీ టికెట్ కొన్న పాయల్**

**12 ఏళ్లుగా దుబాయ్ లాటరీలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న భారతీయురాలు**

**ఇప్పుడు లక్ కలిసి రావడంతో గ్రాండ్ ప్రైజ్‌మనీ సొంతం**




దుబాయ్ డ్యూటీ ఫ్రీ మిలీనియం మిలియనీర్ లో భారతీయ మహిళకు జాక్‌పాట్ తగిలింది. దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో తాజాగా దుబాయ్ డ్యూటీ ఫ్రీ మిలీనియం మిలియనీర్ ప్రమోషన్ కోసం డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో భారతీయురాలు 1 మిలియన్ డాలర్లు(రూ. 8.3 కోట్లు) గెలుచుకున్నారు. పంజాబ్‌కు చెందిన పాయల్ ఈ జాక్‌పాట్ కొట్టారు. దీంతో ఆమె రాత్రికి రాత్రే కోటీశ్వరురాలయ్యారు. ఏప్రిల్‌లో పెళ్లిరోజు కానుకగా భర్త ఇచ్చిన నగదు బహుమతితో ఆమె ఆన్‌లైన్ ద్వారా లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. అలా కొన్న లాటరీ టికెట్ పాయల్‌కు ఇప్పుడు అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఈ నెల 16న తీసిన డ్రాలో ఆమె కొనుగోలు చేసిన లాటరీ టికెట్ నం.3337కు జాక్‌పాట్ తగిలింది. దీంతో రూ. 8.3 కోట్ల భారీ ప్రైజ్‌మనీ ఆమె సొంతమైంది. కాగా, గత 12 ఏళ్లుగా ఆమె దుబాయి లాటరీలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారట. ఏడాదికి ఒకటి లేదా రెండుసార్లు భర్త, పిల్లల పేర్ల మీద క్రమం తప్పకుండా లాటరీ టికెట్లు కొనుగోలు చేస్తున్నట్లు పాయల్ తెలిపారు. చివరికి భర్త ఇచ్చిన క్యాష్ గిఫ్ట్‌తో కొన్న లాటరీ టికెట్ తనకు అదృష్టాన్ని తెచ్చిపెట్టిందన్నారు. ఇంత భారీ మొత్తం గెలుచుకోవడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇక తాను గెలుచుకున్న భారీ ప్రైజ్‌మనీలో కొంత భాగం పిల్లల భవిష్యత్తు కోసం, మరికొంత భాగం ఆస్ట్రేలియాలో ఉంటున్న తన సోదరుడికి సాయం చేస్తానని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా దుబాయి డ్యూటీ ఫ్రీ లాటరీ నిర్వాహకులకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలాఉంటే.. 1999లో ప్రారంభమైన దుబాయ్ డ్యూటీ ఫ్రీ రాఫెల్‌లో ఇప్పటివరకూ 1 మిలియన్ డాలర్లు గెలుచుకున్న భారతీయుల్లో పాయల్ 229వ వ్యక్తి. కాగా, ఈ డ్యూటీ ఫ్రీ రాఫెల్ టికెట్ల కొనుగోలుదారుల్లో ఎక్కువ మంది భారతీయులేనని లాటరీ నిర్వాహకులు చెబుతున్నమాట.

# తల్లికి భరణం ఇవ్వాలంటూ కుమార్తెను ఆదేశించిన ఇండోర్ కోర్టు

**ఆస్తులపై హక్కుతో పాటు వృద్ధుల బాధ్యత కూడా ఉందని వ్యాఖ్య**

**నెలనెలా రూ.3 వేలు ఇవ్వాలంటూ తీర్పు**

**చీరల దుకాణం నడుపుతూ ఆర్జిస్తున్న కూతురు**



తల్లిదండ్రుల ఆస్తులపై కూతుళ్లకు హక్కుతో పాటు వృద్ధాప్యంలో వారిని చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంటుందని కోర్టు తేల్చిచెప్పింది. వృద్ధురాలైన తల్లికి భరణం చెల్లించాల్సిందేనని ఓ కూతురును ఆదేశించింది. నెలనెలా కొంత డబ్బు తల్లికి పంపించాలని పేర్కొంటూ, మధ్యప్రదేశ్ లోని ఇండోర్ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. కూతురు తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టిందంటూ మధ్యప్రదేశ్ కు చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తనకున్నది ఒక్కగానొక్క కూతురని, భర్త పోయాక కూతురుతోనే ఉంటున్నానని చెప్పింది. భర్త నుంచి తనకు అందిన సొమ్ము, ఇంటిని కూతురు తీసేసుకుందని తెలిపింది. ఆపై ఆమె ఇంట్లోనే తనకు చోటిచ్చిందని వివరించింది. అయితే, కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న రోజుల్లో కూతురు తనను కొట్టి ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టిందని చెప్పింది. దీంతో కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొంది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ఇండోర్ అదనపు ప్రిన్సిపల్ జడ్జి మాయా విశ్వలాల్.. ఆ వృద్ధురాలికి నెలనెలా రూ. 3 వేలు పంపాలని ఆమె కూతురును ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. చీరల దుకాణం నడుపుతూ నెలకు సుమారు రూ.22 వేల వరకు సంపాదిస్తున్న కూతురు.. తన తల్లి పోషణ బాధ్యతను తప్పించుకోజాలదని పేర్కొన్నారు.

# నయా స్మార్ట్‌ఫోన్ లాంచింగ్‌కు షావోమీ రెడీ!

**ప్రస్తుతం ఎకానమీగా మారిపోయిన రూ. 50 వేల సెగ్మెంట్**

**ఈ సెగ్మెంట్‌లో అరకొరగా ఫోన్లు**

**గ్యాప్‌ను భర్తీ చేసేందుకు రెడీ అయిన షావోమీ**

**వచ్చేస్తున్నట్టు చెప్పిన షావోమీ ఇండియా హెడ్**


**దశాబ్దం క్రితంతో పోలిస్తే వినియోగదారుల మైండ్‌సెట్ మారిందన్న అనూజ్‌శర్మ**



చైనీస్ మొబైల్ మేకర్ షావోమీ మరోమారు భారత మార్కెట్లను దున్నేయాలని భావిస్తోంది. ఈ ఏడాది మొదట్లో 14 సిరీస్‌ను లాంచ్ చేసిన సంస్థ ఇప్పుడు రూ. 50 వేల సెగ్మెంట్‌లో మార్కెట్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తోంది. అందులో భాగంగా రెడ్‌మీ నోట్ 13 ప్రొ ప్లస్ 5జీ (రూ. 30,999, 8o256 జీబీ), ఫ్లాగ్‌షిప్ ఫోన్ షావోమీ 14 (రూ.69,999) మధ్య ఉన్న గ్యాప్‌ను భర్తీ చేసేందుకు రూ. 50 వేల ధరతో మరో ఫోన్‌ను లాంచ్ చేయబోతోంది. ఈ ఫోన్‌కు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించనప్పటికీ రూ. 50వేల సెగ్మెంట్‌లో ఓ సరికొత్త ఫోన్‌ను తీసుకొస్తున్నట్టు షావోమీ ఇండియా సీఈవో అనూజ్‌శర్మ తెలిపారు. 2014-15లో వినియోగదారులు రూ. 9,999 ఫోన్ కోసం వెతికేవారని, అప్పుడదే ఎకానమీ అని పేర్కొన్నారు. దశాబ్దం తర్వాత ఇప్పుడు వినియోగదారుల మైండ్‌సెట్ మారిందని, రూ. 50 వేల సెగ్మెంట్ అనేది ప్రస్తుతం ఎకానమీ అయిపోయిందని వివరించారు. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఈ సెగ్మెంట్‌లో గ్యాప్ చాలానే ఉంది. రూ. 50 వేల ధరలో అతి కొద్ది ఫోన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.ఐక్యూ నుంచి ఓ ఫోన్ అందుబాటులో ఉంది. వన్‌ప్లస్ కూడా 11ఆర్, 12ఆర్‌తో విజయాలు అందుకున్నప్పటికీ ఆ తర్వాత వినియోగదారులు ముఖం చాటేశారు. యాపిల్, శాంసంగ్ వంటి ఫోన్లు అందుబాటులో ఉన్నప్పటికీ అవి సామాన్య వినియోగదారుల దరికి చేరుకోలేక పోతున్నాయి. యాపిల్ ఐఫోన్ 13 ధర రూ.45 వేలే అయినప్పటికీ ఐఫోన్‌ను వాడాలని అనుకుంటున్న వారు మాత్రమే దానివైపు చూస్తున్నారు. ఇక, శాంసంగ్ ఇటీవల రూ. 45 వేల ధరతో గెలాక్సీ ఏ55ను లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో వినియోగదారులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్న షావోమీ రూ. 50 వేల రేంజ్‌లో మార్కెట్‌ను దున్నేయాలని భావిస్తోంది.

# ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలో రిటైర్డ్ సైనిక శునకం ప్రయాణం..

- తొమ్మిదేళ్లపాటు సైన్యంలో సేవలు అందించిన మెరూ అనే లాబ్రడార్ రిట్రీవర్ జాతి కుక్క
- దీంతో దాన్ని సగౌరవంగా రైటైర్మెంట్ కేంద్రానికి తరలించాలని నిర్ణయించిన సైన్యం
- యూపీలోని మీరట్ లో ఉన్న ఆ కేంద్రం వరకు రైల్లో ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలో తరలింపు



మెరూ అనే తొమ్మిదేళ్ల సైనిక శునకం ప్రస్తుతం ఆన్ లైన్ సెన్సేషన్ గా మారిపోయింది. రిటైరైన సందర్భంగా సైన్యం దాన్ని సగౌరవంగా రిటైర్మెంట్ కేంద్రానికి తరలించడం నెటిజన్ల మనసు గెలుచుకుంది. రైల్లోని ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలో కుక్క ప్రయాణించిన ఫొటోలు నెట్టంట వైరల్ గా మారాయి. అందులో మెరూ తన బెర్త్ పై దర్జాగా దుప్పటి కప్పుకొని కనిపించింది. ఏసీ చల్లదనాన్ని ఆస్వాదిస్తూ హాయిగా కునుకు తీసింది. 22 ఆర్మీ డాగ్ యూనిట్ లో ట్రాకర్ డాగ్ గా లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన మెరూ పనిచేసింది. ప్రాణాంతక పేలుడు పదార్థాల జాడ పసిగట్టడం, ఉగ్రవాదుల కాలిబాట ప్రకారం వారు ఎక్కడ దాక్కున్నారో ఆచూకీ కనిపెట్టడం లాంటి విధులు నిర్వహించింది. తొమ్మిదేళ్ల సర్వీసు అనంతరం తాజాగా రిటైరైంది. మీరట్ లోని సైనిక శునకాల రిటైర్మెంట్ కేంద్రంలో శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపనుంది. దేశంలో ఉగ్రదాడులను నిరోధించేందుకు తన వంతు ప్రయత్నం చేసిన మెరూను గౌరవప్రదంగా రిటైర్మెంట్ కేంద్రానికి తరలించాలని సైన్యం నిర్ణయించింది. సైనిక శునకాలు రిటైరయ్యాక వాటి శిక్షకులతో కలసి ఫస్ట్ క్లాస్ ఏసీ రైళ్లలో ప్రయాణించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఇటీవల అనుమతి ఇచ్చింది. దీంతో యూపీలోని మీరట్ లో ఉన్న ఆ కేంద్రానికి మెరూను తరలించేందుకు సైన్యం దాని పేరుతో ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలో బెర్త్ బుక్ చేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను అశోక్ బిజల్వాన్ అనే రిటైర్డ్ నౌకాదళ ఉద్యోగి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే ఈ శునకం ఎక్కడ రైలు ఎక్కిందో మాత్రం వెల్లడించలేదు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లంతా కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మెరూకు సెల్యూట్ చేస్తున్నారు. దాన్ని పెంచుకొనేందుకు చాలా మంది ఉత్సాహం చూపించారు. సైనిక సేవలు అందించే శునకాలను దేశం ఎంతగా గౌరవిస్తుందో ఈ నిర్ణయం తెలియజేస్తోందని అంటున్నారు. ప్రయాణికులు తమ వెంట కుక్కలను తీసుకెళ్లే అవకాశం ఏసీ ఫస్ట్ క్లాస్ లో మాత్రమే ఉందని.. సాధారణంగా అయితే వాటిని బోనులో పెట్టి బ్రేక్ వ్యాన్ లో తరలిస్తారని ఓ యూజర్ కామెంట్ చేశాడు.

# 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా'తో ఐదేళ్ల చిన్నారి మృత్యువాత!

**కేరళలోని మలప్పురం జిల్లాలో ఘటన**

**కలుషిత నీరే కారణం**

**ఇంటి సమీపంలోని చెరువులో స్నానం చేసిన బాధిత బాలిక**

**ఆమె ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్లిన అమీబా**

**మెదడుపై తీవ్ర ప్రభావం చూపించినట్టు గుర్తించిన వైద్యులు**

కలుషిత నీటిలో స్వేచ్ఛగా జీవించే అమీబా వల్ల కలిగే అరుదైన మెదడు ఇన్ఫెక్షన్ 'అమీబిక్ మెనింగోన్సిఫాలిటీస్' (బ్రెయిన్ ఈటింగ్ అమీబా) వ్యాధితో కేరళకు చెందిన ఓ ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. మూన్నియూర్ పంచాయతీకి చెందిన చిన్నారి కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్‌లో వారం రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. బాధిత బాలిక మే 1న సమీపంలోని చెరువులో స్నానం చేసింది. దీంతో మే 10వ తేదీ నాటికి జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయని కుటుంబసభ్యులు తెలిపారు. కలుషితమైన ఆ నీటిలో స్వేచ్ఛగా జీవించే నాన్-పారాసిటిక్ అమీబా ఆమె ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్లి మెదడుపై తీవ్ర ప్రభావం చూపించినట్టు వైద్యులు గుర్తించారు. వ్యాధిని సకాలంలో కుటుంబ సభ్యులు గుర్తించకపోవడం, వైద్య చికిత్స అందించడంలో అప్పటికే ఆలస్యం కావడంతో బాలిక చనిపోయినట్లు వైద్య నిపుణులు వెల్లడించారు.




**అసలేంటీ బ్రెయిన్ ఈటింగ్ అమీబా?**

పరాన్నజీవి కానటువంటి బ్యాక్టీరియా వర్గానికి చెందిన ఒక రకమైన అమీబాతో ఈ వ్యాధి వస్తుంది. కలుషితమైన నీటిలో జీవించే ఈ జీవి ముక్కు లేదా నోటిద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడును క్రమక్రమంగా పనిచేయకుండా చేస్తుంది. దీన్ని ఒకవిధంగా మెదడును తినేసే అమీబా (బ్రెయిన్ ఈటింగ్ అమీబా) గా పిలుస్తారు. ఈ వ్యాధి సోకినవారికి తొలుత తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు అవుతాయి. అలాంటి వారికి వెంటనే వైద్యం అందించకపోతే బాధితులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. కేరళలో గతంలో కూడా రెండుసార్లు ఇలాంటి కేసులు వెలుగు చూశాయి. 2017లో ఒకసారి, 2023లో మరోసారి ఈ కేసులు బయటపడ్డాయి.

# మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

## - పియర్స్ దెబ్బతిన్న చోట తీసుకుంటున్న చర్యలపై ఆరా

మహదేవపూర్ (ప్రజా మంటలు): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం బుధవారం పరిశీలించింది. పూణే నుంచి మేడిగడ్డకు చేరుకున్న నిపుణుల బృందం క్యాంపు కార్యాలయంలో భోజన విరామం అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. బ్యారేజీపై కుంగిన వంతెన చోట కాలి నడకన సాగుతూ అణువణువు పరిశీలించారు. ప్రధానంగా ఏడో బ్లాక్‌లోని దెబ్బతిన్న పియర్స్‌ను పరిశీలించి కుంగుబాటు గల కారణాలను ఇంజినీరింగ్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీలో అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లలో తిరుగుతూ అణువణువూ పరిశీలించారు. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిపుణుల బృందంలో జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ నిపుణులు సైంటిస్ట్ జె.ఎస్ ఎడ్లబడ్కర్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ నిపుణులు సైంటిస్ట్ డాక్టర్ ధనుంజయ్ నాయుడు, నాన్ డిస్ట్రక్టీవ్ పరీక్ష ఎక్స్‌పెర్ట్ డాక్టర్ ప్రకాశ్ పాలేకు పలు అంశాలను సీఈ సుధాకర్ వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఫోటోలను తీసుకున్నారు. బ్యారేజ్ ప్రాంతంలో ఎక్కడెక్కడ ఇబ్బంది ఉందో దెబ్బతిన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. రెండు గంటలుగా పైగా మేడిగడ్డ బ్యారేజీని సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం పరిశీలన సాగించింది.



## జూన్ లో బ్యాంకులకు ఎన్ని రోజులు సెలవులో తెలుసా?

జూన్ 2- ఆదివారం, బ్యాంకులకు సెలవు..
జూన్ 9- ఆదివారం,మహారాణా ప్రతాప్ జయంతి,హిమాచల్ ప్రదేశ్, హర్యానా మరియు రాజస్థాన్
జూన్ 10- సోమవారం, శ్రీ గురు అర్జున్ దేవ్ జీ అమరవీరుల దినోత్సవం,పంజాబ్
జూన్ 14 - శుక్రవారం, పహిలి రాజా, ఒరిస్సా
జూన్ 15 - శనివారం - రాజా సంక్రాంతి, ఒరిస్సా
జూన్ 17 - సోమవారం, బక్రీద్
జూన్ 21- శుక్రవారం, వట్ సావిత్రి వ్రతం, అనేక రాష్ట్రాలు
జూన్ 22- శనివారం,సంత్ గురు కబీర్ జయంతి
జూన్ 30- ఆదివారం, దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవులు..: ఈరోజుల్లో బ్యాంకులు పనిచెయ్యవు ఏదైన పని ఉంటేముందు రోజుల్లో చూసుకోవడం మంచిది..

# దొడ్డు వడ్లకూ రాయితీ ఇవ్వండి

- చేసిన పనులు చెప్పుకోలేకే ఓటమి పాలయ్యాం
- ఆరు నెలల్లోనే అంతా తారుమారు
- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారు
- మళ్లీ కరెంట్ కోతలు..ఇన్వర్టర్ల మోతలు
- విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడి..ట్రాన్స్‌ఫార్మర్ల పేలుళ్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

నర్సంపేట (ప్రజా మంటలు): మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్-నల్లగొండ --ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే టెట్ పరీక్ష ఫీజు రూ. 20 వేలు చేస్తరని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఒక గళాన్ని మండలికి పంపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తా అన్నాడు. 50 వేలతో మెగా డీఎస్సీ అన్నాడు. ఈ రెండు అమలు కాలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నారు. అవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు. లీగల్ సమస్యల వల్ల ఆగిపోయాయి. కేవలం కాగితాలు ఇచ్చి తాను ఇచ్చానని ఊదరగొడుతున్నారు. విచక్షణ కలిగిన విద్యావంతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సమాజానికి దిక్సూచిగా ఉంటూ, దిశానిర్దేశం చేసేది మీరే.. మీరు కూడా మళ్లీ మోసపోతారా..? లేదా మేల్కొని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి అవకాశం ఇస్తారా..? ఆలోచించుకోవాలి. బీఆర్ఎస్ తరపున రాకేశ్ రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. రాకేశ్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టారని అన్నారు. తెల్లారి లేస్తే బూతులు తిట్టుడు, వెకిలి పనులు చేసుడు కాంగ్రెస్ అభ్యర్థి లక్షణం. దందాలు చేయడం, బెదిరించడం వంటి కేసులు నమోదైనట్లు కాంగ్రెస్ అభ్యర్థి అఫిడవిట్‌లో ఉన్నాయి. తీన్మార్ మల్లన్న అఫిడవిట్‌లో 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులు, అనుమతి లేకుండా అమ్మాయిల ఫోన్ నంబర్లను ఫేస్‌బుక్‌లో పెట్టిన కేసులు, బ్లాక్ మెయిల్ చేసిన కేసులు.. ఇలా 56 క్రిమినల్ కేసులు ఉన్న మహానుభావుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. కాబట్టి అభ్యర్థుల గుణగణాలు చూడాలి. మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించండి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నర్సంపేట యువత తరపున రేపు మండలిలో గల్లా పట్టి అడిగే పరిస్థితి మాత్రం ఉంటదని అన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడా అని ప్రభుత్వాన్ని నిలదీసే వాయిస్ ఉంటది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరు రైతు బిడ్డలుగా, విద్యావంతులుగా మోసాన్ని గ్రహించి ఓటేయకపోతే నష్టపోయేది మీరే. నోటిఫికేషన్లు ఇవ్వక పోయిన పట్టభద్రులు ఓటేశారు అని ప్రభుత్వం అనుకుంటది. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా మాకు ఓటేశారు అనుకుంటారు. ఒక్క పరీక్షకు కూడా ఫీజు ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ. 400 ఉండే. ఇప్పుడు రూ. 2 వేలు అయింది. మళ్లీ వాళ్లకు ఓటేస్తే టెట్ ఫీజు రూ. 20 వేలు చేయరా..? ఆలోచించండి. పదేండ్లలో తెలంగాణలో ఎంతో ప్రగతి సాధించాం. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలు గ్రామపంచాయతీలు అయ్యాయి. ఐటీ ఎగుమతులు పెరిగాయి. పరిశ్రమలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు.

## ఇంట్లో తోట బిఆరోగ్యాల పంట



" ఆదివారం సెలవు రోజు కావడంతో కమల్ టివి చూస్తున్నాడు. కూరగాయల మొక్కల పైన రసాయనాలను పిచికారి చేస్తున్నారని, వాటి నుండి వచ్చే కాయగూరలను మనం తినడం వలన మనిషి జీర్ణ వ్యవస్థ పైన తీవ్ర ప్రభావం చూపుతు%శీ%ది .కాబట్టి సేంద్రియ పద్ధతిలో అందించిన కూరగాయలను వాడినట్లయితే ఆరోగ్యంగా ఉంటారని" టీవీలో వచ్చిన వార్తను చూశాడు కమల్. తీవ్రంగా ఆలోచించాడు. వెంటనే తన అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి తాతయ్య దగ్గరికి వెళ్లి టీవీలో వచ్చిన వార్త గురించి చెప్పాడు.

తాతయ్య "ఒరేయ్ కమల్ నిజమే మోతాదుకు మించి రసాయనాలు చల్లడం ద్వారా చెట్లు వాటిని పీల్చుకొని మనకు అందించిన వాటి ఫలాలు కాయ గూరలను మనం తినడం వలన మన శరీరంలోకి ప్రవేశించిన రసాయనాలతో అంతుచిక్కని రోగాలు రావడం పరిపాటి అయింది. ముఖ్యంగా నరాల బలహీనత వెంట్రుకలు పండిపోవడం కాళ్లు చేతులు విపరీతంగా లాగడం ఈ మధ్య చాలా ఎక్కువ అయ్యాయి ఒకప్పుడు మేము ఎలాంటి రసాయనాలు చల్లకుండా వ్యవసాయాన్ని చేసేవాళ్ళ%శీ%. అప్పుడు అందరం చాలా ఆరోగ్యంగా ఉండే వాళ్ళం .కానీ ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చింది" అని చెప్పగానే కమల్ ఒక ఉపాయాన్ని ఆలోచించాడు , తాతయ్యకు తన ఉపాయం చెప్పగానే తాతయ్య సరేనన్నాడు.

తన ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని చదును చేసి , రెండు మదులను సిద్ధం చేశాడు. రకరకాల కూరగాయల విత్తనాలను చల్లాడు. అందులో పశువుల పేడ, మేక పెంట, ఇంట్లో వ్యర్థ పదార్థాలను కుళ్ల పెట్టి, తద్వారా వచ్చిన ఎరువును మడులలో చల్లాడు. ఇంట్లో నుండి వచ్చే వ్యర్థమైన నీటిని కాలువ ద్వార మళ్ళించాడు. వారం రోజుల్లో విత్తనాలు మొలకె త్తాయి. ఇది చూసిన కమల్ చాలా సంతోషించాడు.

ఇరవై రోజుల్లో రకరకాల ఆకుకూరలు కాయగూరలు తెంపి వాళ్ళ అమ్మకు అందించే వాడు. చక్కటి రుచికరమైన తాజా కూరగాయల రోజు వలన వారి కుటుంబ సభ్యులందరికీ కూడా ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే విషయాన్ని పాఠశాలలో ఉపాధ్యాయులతో తన స్నేహితులతో చెప్పాడు .వారందరూ కూడా కమల్ మాదిరిగానే "మన ఇంటి దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కమల్ చేసిన మంచి పనికి వాళ్ల తాతయ్య అభినందించాడు.

నీతి: రసాయనాలు వాడ వద్దు బిసేంద్రీయ ఎరువులే ముద్దు

యాడవరం చంద్రకాంత్ గౌడ్
సిద్దిపేట,
9441762105




### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# సమిష్టి కృషితో ముందుకు సాగాలి !

కొత్తగా కొన్ని రాష్ట్రాల్లోనూ..కేంద్రంలోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్న తరుణంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి. కొత్తగా ఏర్పడే కేంద్ర ప్రభుత్వం మూసపద్దతిలో కాకుండా దేశం పురోగమించే దిశగా ప్రణాళికలతో ముందుకు సాగాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అధికా జనాభా, జిఎస్టీ వంటి సమస్యలను ప్రధానంగా తలకెత్తుకోవాలి. ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. కొత్త ప్రధాని రాష్ట్రాల సిఎంలను విశ్వాసంలోకి తీసుకుని ముందుకు సాగాలి. కలిసి పని చేయాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. తమ పార్టీ అధికారంలో లేదన్న కారణాలతో రాష్ట్రాలను చిన్నతనం చేయరాదు. ఇలా చేయడం అన్నది ప్రజలను అవమానించడమే అవుతుంది. అలాగే దేశంలోను, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న జాతీయ,ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ పాటించా ల్సిన అవసరం ఉంది. దేశాన్ని రాష్ట్రాలను ఆర్థికంగా బలోపేతం చేయడం మరచి ప్రజలకు ఉన్న డబ్బులకు తోడు లక్షల కోట్లలో అప్పులు చేసి పందేరం చేయడం, ఖాతాల్లో నగదు బదిలీ చేయడం ఆగిపోవాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉండరాదు. గుదిబండగా మారిన పథకాలను ఎప్పటికైనా సమీక్షించి అందుకు తగు నిర్ణయం తీసుకోవాలి. నితరంత రాయంగా డబ్బుల పందేరం లేదా పథకాలో డబ్బులు పంచడంతో ఓట్లు పొందాలన్న ఎత్తుగడలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. ఆలగే కులగణన అన్నది కులాల కుంపట్లు రగిలించడం ఖాయం. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితుల ఆధారంగా గణన జరగాలి. కులరహిత సమాజాం కోసం పాటుపడాల్సిన పాలకులు, రాజకీయ నేతలు కులాల కుంపట్లను ఇంకా ప్రోత్సహిస్తున్నారు. రాజకీయాలు మొత్తం కులాల చుట్టే తిరుగుతున్నాయి. ఇందుకోసం కులాల వారీగా పథకాలు ప్రకటిస్తున్నాయి. అయితే నగదు బదిలీలు, లేదా ఇతర తాయిలాలు ప్రకటించడం దారుణం కాక మరోటి కాదు. రాజకీయ పార్టీలన్నీ ఈ సార్వత్రిక బిసిల ఎజెండా అంటూ వల్లె వేసాయి. ఏ కులం అయినా జాబితాలో మరచిపోయామా అని దివిటీ పెట్టి వెతుకుతున్నాయి. జగన్ కూడా సంక్షేమం, అభివృద్ధిని జోడించి డబ్బులను నేరుగా ఖాతాల్లో జమ చేయడమే అన్న విశ్లేషన ఇచ్చారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేస్తూ వచ్చారు. డబ్బులు పంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఈ విషయంలో ఇకనైనా తీరు మారాలి. ఎపిలోఎవరు అధికారం చేపట్టినా ఈ డబ్బుల పందేరంపై ఆంక్షలు విధించాల్సిందే.

మౌళిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం అధోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల సౌకర్యాలను, అవసరాలను గుర్తించి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్ల వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యా వైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. అలాగే కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఫెదరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జిఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్దంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ కూడా పాలనలో భాగం కావాలి. ఓ వైపు రాష్ట్రాల అభవృద్ధికి కేంద్రం సహకరిస్తూనే..దేశం పురోగమించేలా చేయూతను ఇవ్వాలి. సమిష్టి కృషికి ఈ కొత్త ప్రభుత్వం ఆదర్శం కావాల్సి ఉంది.

## చార్ధామ్ యాత్రికులకు నిరాశ

### ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్ మూసివేతతో ఇబ్బందులు

### మే 31న తెరచుకోనున్న రిజిస్ట్రేషన్

డెహ్రాడూన్,మే22 (ప్రజామంటలు):



హిందువులు ఎంతగానో ఎదురుచూసే చార్ ధామ్ కేదార్నాథ్ ఆలయ తలుపు తెరచుకోవడంతో ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్రకు దేశ నలుమూలల నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఊహించిన దానికంటే యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు యాత్రకు పోటెత్తుతున్నారు. దీంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిషేధించింది. చార్ ధామ్ యాత్ర కోసం హరిద్వార్, డెహ్రాడూన్‌లలో రవాణా శిబిరాలు ఏర్పాటు చేసారు. గత కొన్ని రోజులుగా ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.నాలుగు ధామ్‌లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్ మే 31 వరకు మూసివేయనున్నామని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టం చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యాత్రికులు మాత్రమే ప్రస్తుతం యాత్రకు వెళ్లగలరు. ఇటువంటి పరిస్థితిలో ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న భక్తులు తమరిజిస్ట్రేషన్ కోసం తదుపరి ప్రభుత్వ ఉత్తర్వుల వరకు వేచి ఉండవలసి ఉంటుంది.. మరో వారం రోజుల పాటు కోసం వేచిచూడాలి. డెహ్రాడూన్, హరిద్వార్ జిల్లాల్లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ క్యాంపులను ఏర్పాటు చేసింది. నిత్యం భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటున్నారు. యాత్రకు వెళ్ళడానికి ఎంత సమయం అయినా ఈ శిబిరాల్లో వేచి చూస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.మే 31 వరకు చార్ ధామ్ కొత్త భక్తులను ఆహ్వానించవద్దని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే చేరుకున్న వేలాది మంది పర్యాటకులు హరిద్వార్‌లోని హోటల్ ధర్మశాలలో ఉన్నారు. రిజిస్ట్రేషన్ తెరిచే సమయం కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో హరిద్వార్ టూర్ అండ్ ట్రావెల్స్ వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# తొలి వార్తా హారుడు .. ఆదర్శ పాత్రికేయుడు నారదుడు

### వైశాఖ కృష్ణ పాడ్యమి నారద జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నారదుడు దేవర్షి, సంగీతజ్ఞుడు. నిరంతరం లోక సంచారి. చేతుల్లో చిరుతలు, మహతి అనే వీణా ధారియై, హరి నామ సంకీర్తన చేస్తూ, నిరంతరం తిరుగాడడమే ఆయన పని. ఆయా ప్రాంతాల విశేషాలను అందరికీ తెలుపు తుంటాడు. ఆయన ఒక "ఆదర్శ పాత్రికేయుడు". మంచి చెడుల మధ్య జరిగే యుద్ధంలో ఆయనది ఎప్పుడూ ధర్మ పక్షమే. కృత, త్రేతా, ద్వాపర యుగాలన్నిటిలోనూ ఆయన ఉంటాడు. నారదుడి పేరు ప్రస్తావించని హిందూ పురాణం లేదు. అష్టాదశ పురాణాలు, రామాయణ, మహాభారతాల్లోనూ నారదుడు పాత్ర గురించి వివరించారు.

నారదుని జన్మతిధి వైశాఖ బహుళ పాడ్యమి. ఈ తిధినాడే నారద జయంతిని జరుపు కునే సాంప్రదాయం ఉంది. నారదుడు మూడు లోకాల్లోను సంచరిస్తూ భక్తి మార్గాన్ని ప్రచారం చేస్తుంటాడు. ఎంతోమంది సాత్వికులకు అయన మోక్ష మార్గాన్ని చూపించాడు. ధర్మానికి అధర్మానికి జరిగే పోరాటంలో ఆయన తనదైన పాత్ర పోషిస్తుంటాడు. అయితే కొంతమంది మేధావులు, రచయితలు మాత్రం ఆయన్ను "కలహ భోజనుడు" గా "కలహ ప్రియుడు" గా అభివర్ణించారు. వాస్తవానికి, నిజం మాట్లాడే వారికి ఎప్పుడు కష్టాలే. "యదార్థవాది లోక విరోధి". ఆధునిక కాలంలో కూడా సత్యాన్ని ధర్మాన్ని పాటించే వారంటే చిన్నచూపు. వారిని లోక విరోధులుగానే చూస్తారు. అనేక కష్టాలకు గురి చేస్తారు. నారద మహర్షి కూడా లోక కళ్యాణం కొరకు నిరంతరం తపించేవాడు. ముల్లోకాలలోనూ సంచరిస్తూ దేవ, మానవ, దానవులకు సందర్భాను సారంగా కర్తవ్య బోధ చేస్తుంటాడు. అయితే నారదుడిది ఒకటే లక్ష్యం. ధర్మం గెలవాలి.

బ్రహ్మ మానస పుత్రుడు, త్రిలోక సంచారి, నారాయణ భక్తుడు, ముక్తుడు అయిన నారదుడు విశ్వ హితుడు. తెలుగు సాహిత్యం లోనూ, తెలుగు సినిమాల లోనూ నారదుని కలహ ప్రియత్వం, వాక్చతురత తరచు ప్రస్తావించ బడుతాయి. ఉపనిషత్తులు, పురాణములు, ఇతిహాసములలో నారదుని కథలు బహుళంగా వస్తాయి.

నారదుని పాత్ర చాలా పురాణాలలో కనిపిస్తుంది.

భాగవతం, ప్రథమ స్కంధంలో నారదుడు వేద వ్యాసునికి భాగవతం రచింపమని బోధిస్తాడు. ఈ సందర్భంలోనే నారదుడు తన పూర్వ గాథను వ్యాసునకు వివరిస్తాడు. రామాయణం, బాలకాండలో నారదుడు వాల్మీకికి ఉత్తమ పురుషుడైన శ్రీరాముని గురించి చెప్పి రామాయణం వ్రాయమనీ, అది ఆచంద్రార్కం నిలిచి ఉంటుందనీ ఆనతిస్తాడు. అలా చెప్పిన భాగమే సంక్షిప్త రామాయణంగా చెప్పబడుతుంది.

మహా భాగవతం మొదటి స్కంధంలో నారదుడు తన గాథను స్వయంగా వేద వ్యాసునికి తెలిపాడు. తాను పూర్వ జన్మ పుణ్య కారణంగా హరికథా గానం చేస్తూ ముల్లోకాలలో సంచరింప గలుగుతున్నానని చెప్పాడు.

పూర్వ కల్పంలో నారదుడు వేదవిదులైన వారింట పని చేసే ఒక దాసికి కుమారుడు. ఒకమారు అతడు చాతుర్మాస్య వ్రతం ఆచరించే కొందరు యోగులకు శ్రద్ధగా పరిచర్యలు చేశాడు. వారు సంతోషించి ఆ బాలునికి విష్ణుతత్వం ఉపదేశించారు. వారి దయవలన ఆ బాలుడు వాసుదేవుని అమేయ మాయా భావాన్ని తెలుసు కొన్నాడు. ప్రణవంతో కలిపి వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ మూర్తులను స్మరించి నమస్కరించి నట్లయితే సమ్యక్ దర్శనుడు అవుతాడని గ్రహించాడు. ఆయన తల్లి ఒకనాడు పాము కాటువల్ల మరణించింది. అప్పుడు నారదుడు అన్ని బంధముల నుండి విముక్తుడై అడవికి పోయి భగవత్స్వరూపాన్ని ధ్యానించడంలో నిమగ్నమై ఉంటాడు. ఏకాగ్ర ధ్యాన సమయంలో అతని మనస్సులో భగవత్స్వరూపం గోచరించింది. కాని మరుక్షణమే అంతర్ధానమైంది. చింతాక్రాంతుడై నారదుడు అడవిలో తిరుగుతుండగా అతనికి దివ్యవాణి ఇలా ఆదేశమిచ్చింది – ఈ జన్మలో నీవు నన్ను పొందలేవు. కాని నా దర్శనం వల్ల నీ సందేహాలు తొలగి అచంచలమైన భక్తి చేకూరింది. ఈ శరీరం త్యజించిన పిమ్మట నా పార్షదుడవై నన్ను పొంద గలవు. – నారదుడు సంతుష్టుడై నిరంతరం హరి నామ జపం చేస్తూ కాలం గడిపి, అంతిమ సమయం ఆసన్నమైనపుడు తన దేహాన్ని త్యజించాడు.

అనంతరం ప్రళయ కాలం సమీపించగా, ఒక సముద్రంలా ఉన్న ఆ జలరాశి మధ్యలో, నిద్రకు ఉపక్రమించిన బ్రహ్మ శ్వాసలో ప్రవేశించి, ఆయనలో లీనమయ్యాడు. వేయి యుగాల కాలం తరువాత బ్రహ్మ లేచి లోకాలను సృష్టించడం ఆరంభించినపుడు, బ్రహ్మ ప్రాణముల నుండి మరీచి మొదలైన మునులతోబాటు నారదుడు కూడా జన్మించాడు. కనుకనే నారదుని బ్రహ్మ మానస పుత్రుడయ్యాడు. అలా నారదుడు అఖండ దీక్షాపరుడై విష్ణువు అనుగ్రహం వలన నిరాటంకంగా సంచరించ గలుగు తుంటాడు. తాను స్మరించగానే నారాయణుని రూపం అతని మనసులో సాక్షాత్కరిస్తుంది...ఇలా తన కథ చెప్పి హరికథా గానంతో నిండి వున్న భాగవతాన్ని రచించమని నారదుడు వేద వ్యాసునికి ఉపదేశించాడు.

మహా భారతం సభాపర్వంలో నారదుని గురించి ... వేదోపనిషత్తులను, పురాణాలను బాగా తెలిసినవాడు. దేవతలచే పూజితుడు. కల్పాతీత విశేషాల నెఱిగినవాడు. న్యాయ ధర్మ తత్వజ్ఞుడు. శిక్షా కల్ప వ్యాకరణాలు తెలిసిన వారిలో శ్రేష్టుడు. పరస్పర విరుద్ధములైన వివిధ విధి వాక్యాలను సమన్వయ పరచగల నీతిజ్ఞుడు. గొప్ప వక్త, మేధావి. జ్ఞాని, కవి, మంచి చెడులను వేరు వేరుగా గుర్తించుటలో నిపుణుడు. ప్రమాణముల ద్వారా వస్తు తత్వమును నిర్ణయించుటలో శక్తిశాలి. న్యాయ వాక్యముల గుణదోషముల నెఱిగినవాడు. బృహస్పతి వంటి విద్వాంసుల సందేహములు కూడా తీర్చగల ప్రతిభాశాలి. ధర్మార్థ కామ మోక్షముల యథార్ధ తత్వము నెరిగినవాడు. సమస్త బ్రహ్మాండముల యందును, ముల్లోకముల యందును జరుగు సంఘటనలను తన యోగబలముచే దర్శింప గలడు. సాంఖ్యయోగ విభాగములు తెలిసినవాడు. దేవ దానవులకు వైరాగ్యమును ఉపదేశించుటలో చతురుడు. సంధి విగ్రహ తత్వములు తెలిసినవాడు. కర్తవ్య, అకర్తవ్య విభాగము చేయగల దక్షుడు. రాజనీతికి సంబంధించిన ఆరు గుణములలో కుశలుడు. సకల శాస్త్ర ప్రవీణుడు. యుద్ధ విద్యా నిపుణుడు. సంగీత విశారదుడు. భగవద్భక్తుడు. విద్యాగుణనిధి. సదాచారములకు ఆధారమైనవాడు. లోక హితకారి.

వ్యాసుడు రచించిన అష్టాదశ పురాణములలో నారద పురాణం ఒకటి. ఈ పురాణంలో 25,000 శ్లోకాలు ఉన్నాయి. నారద పురాణాన్ని నారదీయ పురాణం అని కూడా పిలుస్తారు. నారద పురాణంలో పూర్వార్థం, ఉత్తరార్థం అని రెండు భాగాలు ఉన్నాయి. పూర్వార్థం సంభాషణ సనక మహర్షికి నారదుడుకి మధ్య జరుగుతుంది. రెండవ భాగం అయిన ఉత్తరార్థంలో వశిష్ఠ మహర్షి వక్త, మాంధాత శ్రోత. ఈ పురాణంలో వేద వేదాంగాల గురించి, మంత్రముల గూర్చి, వివిధ దేవతా కవచాల గురించి చెప్ప బడింది. ఉత్తర భాగంలో మోహిని రుక్మాంగద చరితం ఉంది. ఈ రుక్మాంగద చరితానికి బృహన్నారదీయం అని నామాంతరం ఉంది.

నారద పురాణంలో విశేషంగా జ్యోతిఃశాస్త్ర విశేషాలు, మంత్రశాస్త్ర విశేషాలు చెప్పబడ్డాయి. నారద పురాణాన్ని మంత్రశాస్త్ర సంగ్రహం అని చెబుతారు. ఇందులో ఆదిత్య, అంబిక, విష్ణు, శివ, గణపతి, నవగ్రహ మంత్రములు, కార్తవీర్య మంత్రం, హయగ్రీవ మంత్రోపాసన, హనుమాన్ మంత్రం సంగ్రహించ బడ్డాయి. ఉత్తర భాగంలో వివిధ పుణ్యక్షేత్రాల గూర్చి చెప్పబడింది. కాశి, గయ, ప్రయాగ, పురుషోత్తమ క్షేత్ర, పుష్కర క్షేత్రం, గోకర్ణ క్షేత్రం, రామ సేతు, అవంతి తీర్థం, ద్వాదశి, ఏకాదశి వ్రత విధానం గురించి చెప్ప బడింది. బ్రహ్మ మానస పుత్రుడు, త్రిలోక సంచారి, నారాయణ భక్తుడు, ముక్తుడు అయిన నారదుడు విశ్వ హితుడు.

నారం అంటే జ్ఞానం. జ్ఞానం నిరంతర ప్రవాహితం. దేవలోకంలో ఉన్న అన్ని విద్యలు, విజ్ఞానమంతా మానవులకు చేరడానికి మాధ్యమం నారదుడే. ధ్రువుడు, ప్రహ్లాదుడు ఆదిగా ఎందరికో జ్ఞాన బోధ చేసి లోక కళ్యాణం వైపు నడిపించిందే ఆయనే. అసలు విష్ణుమూర్తి అవతారాల కారకుడు ఆయనే. ప్రస్తుత కాలంలో పాత్రికేయులు నారదుని ఆదర్శంగా గైకొని, జ్ఞాన పిపాసులై, తాము సముపార్జించిన విజ్ఞానాన్ని అందరికీ అందించే ప్రయత్నం చేయాలి. ధర్మం, న్యాయం, సత్యం ఆచరణకు ప్రజలను కార్యోన్ముఖులను చేయాలి. ఆ మార్గంలో పాత్రికేయులకు మహర్షి నారదుని జీవితం పరమ ఆదర్శం.



# అక్రమ సంబంధాలతో కుటుంబ వ్యవస్థ పతనం

**- ప్రముఖ సోషల్ మీడియా సైట్స్ ప్రభావం - ప్రముఖ రాజకీయ విశ్లేషకులు మొహమ్మద్ అంకూస్**



**జమ్మికుంట మే 22 (ప్రజామంటలు):**
నేటి సమాజంలో రోజు రోజుకి కుటుంబ విలువలు, బంధాలు బంధుత్వాలు దిగజారిపోతున్నాయి. ఈ బిజీ లైఫ్ లో తల్లితండ్రులకు పిల్లలను పట్టించుకునే టైం లేకపోవడం, పిల్లలను చిన్నతనం నుండే రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివించడం, సోషల్ స్టేటస్ కోసం ఇతరులతో పోల్చుకొని విలాసాలకు అలవాటు పడడం, వీటి మూలంగా విద్యావ్యవస్థలో నైతిక విలువలు పూర్తిగా పడిపోతున్నటువంటి పరిస్థితి ఏర్పడింది. చిన్నప్పటినుండే తల్లితండ్రులకు దూరంగా ఉన్నటువంటి పిల్లలు, తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు దగ్గరగా చూసుకుంటారనుకోవడం పొరపాటు. కుటుంబ విలువలు రోజురోజుకు దిగజారిపోయి భార్యాభర్తల మధ్య దూరం పెరిగిపోయి ఇటీవల కాలంలో విడాకులు ఎక్కువ అవుతున్న విషయం మనం గమనిస్తున్నాం, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి ప్రపంచం మన చేతుల్లో ఉండడం సెల్ ఫోన్ రూపంలో ఫేస్ బుక్, వాట్సప్, ఇంస్టాగ్రామ్, టిక్ టాక్, ట్విట్టర్ లాంటి అనేక సోషల్ మీడియా వేదికల ద్వారా పరిచయాలు విపరీతంగా పెరిగి ఒకరికొకరు అట్రాక్షన్ లో పడి తమకు పెళ్లి అయిపోయిందనే విషయం, పిల్లలు ఉన్నారు అనే విషయం మర్చిపోయి, వయసుతో సంబంధాలు లేకుండా అక్రమ సంబంధాలు కొనసాగిస్తూ భార్య పిల్లలను వేధిస్తూ లేకుంటే భార్య అక్రమ సంబంధాలు పెట్టుకొని సొంత భర్తను చంపించడం లాంటి సంఘటనలు మనం ఇటీవల రోజు చూస్తున్నా. దీనంతటికీ కారణం చిన్నప్పటినుండి కుటుంబ విలువలు నేర్పకపోవడమే చదువు, ర్యాంకులు ర్యాంకులు ర్యాంకులు చదువు, అంటూ విద్యార్థి పైన ఒత్తిడి చేసి ఒక సాంకేతిక వస్తువు లాగా విద్యార్థిని చూసి ఫ్యామిలీ ఎమోషన్స్ ను తనలో లేకుండా చేయడం వల్ల ఈ అక్రమ సంబంధాలు చాలా ఈజీగా తీసుకొని, ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు మనం ఇటీవల చాలా చూస్తున్నాం. ప్రముఖ సీరియల్ నటులు పవిత్ర జయరాం, చందు యాదవ్ విషయంలో మనం విస్తు పోయే నిజాలను చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది, వాస్తవానికి చందు 11 సంవత్సరాలు ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ పవిత్ర మత్తులో పడి కుటుంబాన్ని మరచి పవిత్ర చనిపోగానే తను కూడా ఆత్మహత్య చేసుకోవడం సిగ్గుచేటుగా భావిస్తున్నా, చిన్నప్పటినుండి పిల్లలకు అన్నా చెల్లి తల్లి తండ్రి భర్త భార్య వంటి బంధాల విలువలు అలవర్చినప్పుడుఇటువంటి సంఘటనలు జరగవు అనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి.

**తల్లితండ్రులారా తస్మాత్ జాగ్రత్త...**
మీ పిల్లలు చదువుతోపాటు సంస్కారం, కుటుంబ విలువలు, పెద్దల పట్ల అంకితభావం, చిన్నప్పటినుండే ఆర్థిక క్రమశిక్షణ, ముఖ్యంగా రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ వ్యవస్థను పాఠశాల చదువు పూర్తయ్యే వరకు దూరంగా ఉంటే మంచిది. చిన్నప్పటినుండే కుటుంబ సభ్యుల మధ్య ఎమోషన్స్ ను డెవలప్ చేసినప్పుడే ఒకరిపై ఒకరికి ప్రేమలు ఉంటాయనడం లో అతిశయక్తి లేదు సభ్యత సంస్కారం అనేది కొనుక్కుంటే వచ్చేది కాదు చిన్నప్పటినుండే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పిస్తే వచ్చేది. నేటి సమాజంలో అక్రమ సంబంధాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడి ఆత్మహత్యలు చేసుకుని పిల్లలను ఒంటరి చేసి వెళ్తున్న సంఘటనలు మనం చూస్తున్నాం కాబట్టి పిల్లలకు చిన్నప్పటి నుండే క్రమశిక్షణ నేర్పినట్లయితే వీటన్నింటికీ దూరంగా ఉండి కుటుంబ బంధాలు తెలుసుకొని మెదులుతాడని భావిస్తున్నాము.

## క్వాలిటీ కంట్రోల్ శాఖ ఉందా

**నాణ్యతలేని పనులు?**



**వేలేర్ మే 22 (ప్రజామంటలు):**
వేలేరు మండల కేంద్రంలోని చింతల్ తాండ గ్రామం నుంచి కొత్తకొండ దేవస్థానం వరకు వేసిన రోడ్డు నాణ్యత లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు జిల్లా అధికారులు పాలిటీ కంట్రోల్ శాఖ అధికారులు ఉన్నారా అని ప్రజల్లో అనుమానం కలుగుతుంది మండలంలో వేరే వేరే చోటలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యత లేదని గ్రామస్తులు చర్చ నడుస్తుంది. జిల్లా కలెక్టర్ పట్టించుకోని నాణ్యతలేని పని చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని గ్రామ రైతులు, ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**బీసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ**



**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):**
వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని జగిత్యాల జిల్లా బీసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ ప్రభుత్వాన్ని కోరారు.విద్యా సంవత్సరం చివరి దశకు వచ్చిన ఫీజు రీయింబర్స్ మెంట్ అందలేదని అన్నారు.2022 సంవత్సరం నుండి ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ లోనే 114 కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. దీనితో విద్యార్థులు మరియు కళాశాల యాజమాన్యాలు ఆందోళన పడుతున్నారని అన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. గత మూడు సంవత్సరముల నుండి స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడం బాధారమైన విషయమని అన్నారు. తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థులను మరియు కళాశాల యాజమాన్యాలను ఆదుకోవాలని కోరారు. అలాగే బీసీ గురుకులాల్లో మరియు బీసీ సంక్షేమ వసతి గృహాల్లో తగినంత సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేర్ మే 22 (ప్రజామంటలు):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పెసరు రాధిక 35 సం.లు, మరియు హన్మకొండ వడ్డేపల్లి కి చెందిన నమిండ్ల అవినాష్ 32 సం.లు అనారోగ్యంతో మరణించగా వారి భౌతికాయలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పెసర్ రమేష్ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## చిగురుమామిడి మండలంలో బెల్ట్ షాపులను బందు చేయాలి

**వైన్ షాపులో లిక్కర్ ను అధిక రేట్ కు అమ్మకూడదు**

**ఎం.పి.టి.సి. ల ఫోరం మండల్ ప్రెసిడెంట్ మిట్టపల్లి మల్లేశం**



**చిగురుమామిడి మే 22 (ప్రజా మంటలు):**
గత రెండు మండల జనరల్ బాడీ లో, బెల్ట్ షాపులు మూసేవేయాలి మరియు వైనషాపులో లిక్కర్ ను ఎక్కువ రేట్ కు అమ్మకూడదు, అని తీర్మానం చేసినాము, జనరల్ బాడీ మీటింగ్ సాక్షి గా మెజారిటీ ఎంపీటీసీ లం నెల మీద కూర్చొని బెల్ట్ షాప్ లను బంద్ చేయాలి, వైన్ షాప్ లొ లిక్కర్ ను ఎం.ఆర్.పి. రేట్ లకు అమ్మాలి అని సంబంధిత అధికారులను నిలదిశీ నాము, ప్రస్తుతం జూన్ 4 వరకు ఎలక్షన్ కోడ్ యున్న కాని విచ్చలవిడిగా బెల్ట్ షాప్ లు మండలంలో అన్ని గ్రామాలలో లిక్కర్ ను అమ్ముచున్నారు, పట్టించుకోని అధికారులు, ఇదే కాకుండ వైన్ షాప్ వారు ఒక క్వార్టర్ లిక్కర్ బాటిల్ కు 15 రూపాయలు ఎం.ఆర్.పి. ధరలకే కంటే అధికంగా తీసుకొని ప్రజల రక్తాన్ని త్రాగుచున్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బెల్ట్ షాప్ లు బందు చేయాలి మరియు వైన్ షాప్ లో ఎం.ఆర్.పి. ధరలకే అమ్మాలి. లేకుంటే కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తాము. మండలంలో ఈ సమస్య మీద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని సంబంధిత అధికారులను ఎం.పి.టి.సి. ల ఫోరమ్ మండల్ ప్రెసిడెంట్ మిట్టపల్లి మల్లేశం హెచ్చరించారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి కెటిఆర్ సాయం

**వరంగల్,మే22:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆక్సిడెంట్‌కు గురైన వ్యక్తిని తన ఎస్కార్ట్ కారులో హాస్పిటల్‌కు తరలించారు. వరంగల్ లేబర్ కాలనీ వద్ద అంజయ్య (55) అనే వ్యక్తి ఆక్సిడెంట్‌కు గురై రోడ్డుపై కిందపడి ఉన్నాడు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచార నిమిత్తం అటుగా నర్సంపేటకు వెళ్తున్న కేటీఆర్ అతన్ని చూసి వెంటనే కారు దిగారు. తన కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ కారులో అత్యవసర చికిత్స కోసం వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌కు తరలించారు. సకాలంలో స్పందించి బాధితుడికి అండగా నిలిచిన కేటీఆర్‌ను పలువురు ప్రశంసించారు.

# మే 30న రాష్ట్ర మహాసభలు

**- దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాక డిబిఎఫ్ - మూడు దశాబ్దాలుగా పీడిత వర్గాల ప్రజా గొంతుక**
**- వరంగల్ జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో తరలిరావాలి**
**- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్**




**వరంగల్ మే 22 (ప్రజామంటలు):**
ఈ నెల 30 వ తారీఖున హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ కోరారు. బుధవారం ఖిలా వరంగల్ మండలంలోని 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1995 వ సంవత్సరంలో ఏర్పడిన దళిత బహుజన ఫ్రంట్ గత 30 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో దళితులు,బహుజనులు, పీడిత ,తాడిత మహిళా,మైనారిటీ అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన అలుపెరుగని పోరాటం చేస్తూ ఆయా వర్గాల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో పీడిత వర్గాలు ఎదుర్కొంటున్న కుల వివక్షత, దాడులు, దౌర్జన్యాలు, కుల అసమాన తలు, భూమి సంబంధిత సమస్యలపై పూలే అంబేద్కర్ మొదలగు మహనీయుల మార్గంలో పోరాడుతూ ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను గుర్తు చేస్తూ, హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగ రక్షణ కోసం కృషి చేస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేయడంలో డిబిఎఫ్ పాత్ర మరువలేనిదని ఉద్ఘాటించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి వలన ఏర్పడ్డ విపత్కర పరిస్థితులలో నేపథ్యంలో డిబిఎఫ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో తెలుగు రాష్ట్రాలలో నిత్యవసర వస్తువులు,సానిటైజర్, మాస్కులు పంపిణీ చేయడమే కాకుండా ప్రజలకు కరోనా వైరస్ పై అవగాహన సలహాలు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి పోలేపాక మల్లేశం, పోలేపాక రాణి, సదిరం లాస్య, చిపురు సరోజన, సాదిక్, సిద్ధార్థ, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

## "కబ్జా అవుతున్న ప్రభుత్వ భూమి"

**రక్షించండని ఆర్డీవో ను కోరిన కాలనీ వాసులు**

**జగిత్యాల మే 22 (ప్రజామంటలు):**
సారంగాపూర్ మండలంలోని నాగునూర్ గ్రామంలో ఎస్సి కాలనీలోని ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని ఆ కాలనీ వాసి బిట్ల రమేష్ జగిత్యాల ఆర్డీవోను కోరారు. బుధవారం జగిత్యాల ఆర్డీవో కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. 1983- 84 మధ్యకాలంలో అప్పటి ప్రభుత్వం నాగునూర్ గ్రామంలోని నిరుపేద ఎస్సిల కోసం సర్వే నెంబర్ 158 లో ఇండ్లు నిర్మించి ఇచ్చిందన్నారు.భవిష్యత్ అవసరాల కోసం కొంత స్థలాన్ని ప్రభుత్వం వదిలిపెట్టి ందన్నారు. ఇటీవల కొందరు ఇదే కాలనీ వాసులు మిగిలివున్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలను చేపడుతు న్నార ని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరిం పుల కు దిగుతున్నారని ఇదే విషయంపై మార్చి 6న సారంగాపూర్ తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకో లేదని వెంట నే ప్రభుత్వ భూమి ఆక్రమణల నుంచి కాపా డాల ని ఆర్డీవోను బిట్ల రమేష్ కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల కష్టాలు

**- ఎద్దు ఏడ్చిన వ్యవసాయం నిలవదు**

**- రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు - బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్**



**ఎల్కతుర్తి మే 22 (ప్రజామంటలు):**
ఎల్కతుర్తి మండల కేంద్రం లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలలో భాగంగా రైతులకు వరి పంటకు 500 బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పుడు సన్నలకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు? ఇది మోసం కాదా? రైతులను నమ్మించి మోసం చేయడం మీ ప్రభుత్వానికి చెల్లుతుంది. ఇది ప్రజా పాలన కాదు, రైతు వ్యతిరేక పాలన. వ్యవసాయం పట్ల పక్కా ప్రణాళిక లేక చివరి ఆయకట్టుకు నీరు అందించలేకపోయినా అసమర్ధ ప్రభుత్వం రైతులను ఇబ్బందికి గురి చేసిందని అన్నారు. కరెంటు కోతలతో పంటలను ఎండగొట్టారు. కష్టించి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనకుండా అకాల వర్షాల పాలు చేశారు. రైతులను నడీ సముద్రంలో ముచ్చుతారా అని ప్రశ్నించారు? కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు కౌలు రైతులకు 15000 రైతు భరోసా అన్నారు ఇప్పటివరకు ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు 12000 అన్నారు, వేయలేదు. ప్రతి రైతుకు డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ అన్నారు చేయలేదు? నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం బోగస్ అవలంబిస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో గాలి మాటలతో గారడీ చేసిన కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు డబ్బుల పడగానే నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని అన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవసం నిలవదు. రైతు ఏడ్చిన రాజ్యం నిలువదు. కాంగ్రెస్ను నమ్మి ఓట్లు వేసినా రైతులను కాంగ్రెస్ నట్టేట ముంచిందని అన్నారు. ఇక మిమ్మల్ని వదిలిపెట్టరు. పల్లె పల్లెనా కాంగ్రెస్ ను ప్రజలు ప్రశ్నిస్తారు. తెలంగాణ వ్యాప్తంగా నిలదీస్తారు అని అన్నారు. రైతుల చేతిలో మీకు పరాభవం తప్పదని అన్నారు. ఉద్దెర హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన మీరు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం

**కాలుష్యాన్ని తగ్గిద్దాం... మొక్కలను పెంచుదాం**

**సామాజిక ప్రజా సేవకులు వలస సుభాష్**



**కోహెడ మే 22 (ప్రజామంటలు):**
సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కేంద్రంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రముఖ సామాజిక ప్రజా సేవకులు వలస సుభాష్ విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుడమి మీద ఉన్న జీవరాశులు వృక్ష సంపద కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. కాలుష్యాన్ని తగ్గిద్దాం మొక్కలను పెంచుదాం అనే నినాదంతో ముందుకు సాగుదామని ఆయనే ప్రతిమ భూనాడు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని గ్రామాల్లో చెరువుల్లో కుంటల్లో కలుషితం కాకుండా కాపాడాలని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత గుర్తించాలని పేర్కొన్నారు మొక్కలు పెంచితేనే మానవ మునగడ ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. జీవరాసులను కాపాడవలసిన బాధ్యత అందరి పైన ఉందని ఆయన గుర్తు చేశారు అడవి సంపదను కాపాడాలని ఇంటివద్ద చెట్టును పెంచండి అని ప్రజలకు విద్యార్థులకు వృక్షో రక్షితి రక్షిత అని పిలుపునిచ్చారు పర్యావరణ దిక్సూచి సహజమైన అడవి సంపదని ఆయన అన్నారు. వేసవి తాపం నుంచి పశుపక్షాదులను కాపాడాలని పర్యావరణంలో జరుగుతున్నవాతావరణ మార్పులకు కారణమైన మానవులు బాధ్యత గుర్తించాలని అన్నారు.

## హనుమాన్ ఆలయానికి ఆర్థిక సాయం చేసిన కొయ్యడ మహేందర్



**వేలేరు మే 22 (ప్రజామంటలు):**
వేలేరు మండలం పీచర గ్రామ శివారు వావిలాకుంట తండా లోని వాసులు హనుమాన్ గుడి కోసం 40 మీటర్ల గ్రీన్ మ్యాటు మరియు 30 మీటర్ల లైట్స్ తన వంతుగా అందచేయాలనీ అడగగా వెంటనే స్పందించి ఇవ్వడం జరిగిందని పీచర సమ్మక్క సారళమ్మ చైర్మన్ కొయ్యడ మహేందర్ తెలిపారు.

## మళ్లీ కరెంట్ కోతలు.. ఇన్వర్‌ట్ల మోతలు

**విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడి..ట్రాన్స్‌ఫార్మర్ల పేలుళ్లు**

**ఆరు నెలల్లోనే ఆరుదశాబ్దాలు దౌర్భాగ్యం**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ట్వీట్**

**హైదరాబాద్,మే22:** గత ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు.. 6 నెలల కాంగ్రెస్ పాలనలోనే ఆవిష్కృతమయ్యాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. పదేళ్లు లేని కరెంట్ కోతలను మళ్లీ చూస్తున్నామన్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల ముట్టడి చూస్తున్నట్లు తెలిపారు. మోటార్లు కాలుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. మళ్లీ చాన్నాళ్లకు ఇన్వర్టర్లు, జనరేటర్ల మోతలు చూస్తున్నట్లు చెప్పారు. సాగునీరు పంట పొలాలు ఎండుతున్నాయన్నారు. ట్రాక్టర్లు ఉండాల్సిన పొలంలో ట్యాంకర్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. చుక్కనీరు లేక బోసిపోయిన చెరువులు దర్శనమిస్తున్నాయి. పాత అప్పు కట్టాలని రైతులకు నోటీసులు వస్తున్నాయి. రైతుబంధు కోసం నెలలపాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు. పదేళ్ల తరువాత అన్నదాతల ఆత్మహత్యలు చూస్తున్నాం. విత్తనాల కోసం రైతుల మొక్కులు.. క్యూలైన్ లో పాసుబుక్కులు చూస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి విషాద దృశ్యాలు ఇంకెన్ని చూడాలో. ఎంజీఎం ఆసుపత్రిలో 5 గంటల విద్యుత్ కోత బాధాకరం. ఆసుపత్రులను కూడా ఈ ప్రభుత్వం నిర్వహించలేకపోతోంది. కరెంటు కోతలు లేవని సీఎం, మంత్రులు పదేపదే అంటున్నారు. ఆసుపత్రుల్లో కరెంట్ కోతలకు ఎవరు బాధ్యత వహిస్తారని కేటీఆర్ ప్రశ్నించారు.

## సర్వే నంబర్ 903లో గుడిసెలు వేసేందుకు ఏర్పాట్లు

**అడ్డుకున్న భూముల యజమానులు**

**పోలీసులకు ఫిర్యాదు**



**ఎల్కతుర్తి మే 22 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రం లోని ఇనాం భూముల్లో గుడిసెలు వేయడానికి వరంగల్ కు చెందిన ముస్లిం కుటుంబాల ప్రయత్నం. సర్వే నంబర్ 903లో గుడిసెలు వేసేందుకు ఏర్పాట్లు. అడ్డుకున్న భూముల యజమానులు. పోలీసులకు ఫిర్యాదు. తాతల ముత్తాతల కాలం నుండి చేసుకుంటూ వస్తున్న భూమి ఈరోజు ముస్లిమ్స్ వచ్చి ఈ భూములు మాయి అంటూ గుడిసెలు వేయడం జరుగుతుంది. ఇది ఎంతవరకు న్యాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ భూ వివాదంపై ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉన్నది. కావున దీనిపై ఈ భూమిలో ఎవరైనా గుడిసెలు వేసిన ఎలాంటి పనికి తలపెట్టిన చట్టరీత్యా నేరం కావున ఇందులో ఎలాంటి ప్రయత్నాలు చేయొద్దని అలా చేసినచో చట్టరీత్యా నేరమని ఎల్కతుర్తి పోలీస్ లు తెలిపారు.

## ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**మోహినీ అలంకారంలో స్వామి దర్శనం**

**ఏలూరు,మే22:** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు బుధవారం చిన వెంకన్న స్వామి మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అధికారులు స్వామివారిని సింహ వాహనం పై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరగనుంది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.కాగా ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం స్వామివారు రామ లక్ష్మణ సమేత హనుమాన్అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే హనుమద్వాహనంపై స్వామివారిని ఊరేగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రోడ్లపైకి తరలి వచ్చారు. కాగా రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. అనంతరం వెండి శేష వాహనంపై స్వామివారిని అధికారులు ఊరేగించారు.

## అమెరికా జార్జియాలో చెట్టును ఢీకొన్న కారు

**ప్రమాదంలో ముగ్గురు భారతీయ విద్యార్థుల మృతి**

**న్యూఢిల్లీ,మే22 :** అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా..అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్వక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## మారిన టిఎస్ ఆర్టీసీ పేరు

**ఇకనుంచి టిజిఎస్ ఆర్టీసీగా మార్పు**

**హైదరాబాద్,మే22:** తెలంగాణ ఆర్టీసీ పేరులో మార్పు చోటుచేసుకుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు టీఎస్ ఆర్టీసీగా కొనసాగగా.. ప్రస్తుతం టీజీఎస్ఆర్టీసీగా మారింది. ఇటీవల ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, లెటర్ హెడ్లపై టీఎస్‌కి బదులు టీజీగా పేర్కొనాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం అనుమతి ఇస్తూ గెజిట్ జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు, ప్రభుత్వ పరంగా టీఎస్‌గా రాసే విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీని మార్పు చేస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం అనుమతులు జారీ చేసిన విషయం తెలిసిందే. మొదటగా మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి టీఎస్ తొలగించి టీజీగా మార్చింది. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మార్పులు చేయగా.. తాజాగా ఆర్టీసీ సైతం టీజీఎస్ ఆర్టీసీగా మార్పులు చేసింది. సంస్థ ఎండీ సజ్జనార్ సైతం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగామార్చడం జరిగిందన్నారు.

## సొరెన్ బెయిల్ పిటిషన్ తిరస్కరించిన సుప్రీం

**రాంచీ,మే22:** జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌కు షాక్ తగిలింది. లోక్ సభ ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ దాఖలు చేయాలని కోరుతూ హేమంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. ట్రయల్ కోర్టు రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి మధ్యంతర బెయిల్ ఎలా మంజూరు చేయగలమని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. సొరేన్‌కు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

**- అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**

**జమ్మికుంట మే 22 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రోజున ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ ఆవరణలో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.... తాము అధికారంలోకి వస్తే ఒక్కో రైతుకు రుణమాఫీ 2 లక్షలు చేస్తామని, రైతు భరోసా కింద ఎకరానికి 15000వెలు ఇస్తామని, ధాన్యం క్వింటాలకు 500 బోనస్ చెల్లిస్తామని, ఇండ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలు కేటాయిస్తామని, స్థలం ఉన్న పేదలకు 5 లక్షల రూపాయలు గృహ నిర్మాణానికి చెల్లిస్తామని, కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలు మరియు తులం బంగారం చెల్లిస్తామని, ఇలాంటి వాగ్దానాలు అనేకం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో వడ్లు పండించే ప్రతి రైతుకు క్వింటాల్కు 500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడడం సరికాదన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు ఖర్చు ఎక్కువ వస్తుందని రోగాలు కూడా పంటకు ఎక్కువ వస్తాయని ఆ పంట పండించడానికి రైతులు తక్కువ శాతం మొగ్గు చూపుతారనిఈ విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. నూటికి 80 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని అధికారిక గణాంకాలు కూడా చెబుతున్నాయన్నారు. అలాంటిది సన్న వడ్లకే 500 బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించకుంటే రైతుల నుండి ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత తప్పదన్నారు. బోనస్ అనేది బోగస్ కాకూడదన్నారు. రాష్ట్ర రైతులను మోసం చేస్తే ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్తారు అన్నారు. గొర్రెల పంపిణీ పథకం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గతంలో తీసుకున్న చెక్కులు వాపస్ ఇస్తామని చెప్పడం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు. గతంలో లాగానే గొర్రెల యూనిట్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టినప్పటికీ గత ప్రభుత్వం అరులైన పేదలకు పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఈ ప్రభుత్వంలోనైనా పూర్తయిన ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎవరికి కేటాయించకుండా ఉంటే అవి నిరుపయోగంగా ఉంటున్నాయని శిథిలావస్థకు చేరుకుంటున్నా యన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఎరువులు పురుగు మందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యులు జక్కుల రమేష్ యాదవ్, నాయకులు సిరికొండ మదనయ్య, మారేపల్లి కిరణ్, కొడారి సురేష్, జక్కుల సాయిరాం, కల్లూరి శ్రీనివాస్, పుల్ల రజాక్, నానవేని సురేష్, చల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## భిన్నత్వంలో ఏకత్వం చాటిన 'ఆటో డ్రైవర్ మహమ్మద్ సందాని'

**- హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం సోదరుడు**

**- వెల్లి విరిసిన మతసామరస్యం - గత 8 సంవత్సరాలుగా స్వాములకు భిక్ష ఏర్పాటు**

**జమ్మికుంట మే 22 (ప్రజామంటలు):** లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శం. మరీ ముఖ్యంగా పల్లెల్లో ముస్లింలు, హిందువులు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటారు. ఎవరికి కష్టం వచ్చినా ఒకరికొకరు అండగా ఉంటారు. హిందువుల పండుగల్లో ముస్లింలు. ముస్లిం ప్రార్థనల్లో హిందువులు పాల్గొంటారు. హిందూ ముస్లిం భాయి భాయి అని మరోసారి రుజువు అయింది. బుధవారం ఇల్లందకుంట మండలం లోని సిరిసేడు గ్రామంలో వృత్తి రీత్యా ఆటో డ్రైవర్ మహమ్మద్ సందాని హనుమాన్ మాలదారులకు భిక్ష ఏర్పాటు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ఈ సందర్భంగా సందాని మాట్లాడుతూ%% సిరిసేడు లో హిందూ ముస్లింలు సోదర భావంతో ఉంటామని హనుమాన్ మాలాదారులకు భిక్ష ఏర్పాటు చేయడం సంతృప్తిని ఇస్తుందన్నారు. పేద కుటుంబానికి చెందిన వాడనైన గత ఎనిమిది సంవత్సరాలుగా హనుమాన్ మాల ధారణ స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నానని.. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో తన కుటుంబం చల్లగా ఉంటుందని ఆర్థికంగా ఎదుగుతూ ఆరోగ్యకరంగా ఉంటున్నామని తెలిపారు. హనుమాన్ స్వాముల సమక్షంలో శ్రీ అపర్ణ సోమేశ్వర స్వామి ఆలయం లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, భజనలు చేసి అనంతరం పాఠశాల మైదానంలో సుమారు 100 హనుమాన్ భక్తులకు 5 రకాల వంటకాలు చేసి భిక్ష ఏర్పాటు చేశామని తాను స్వయంగా భక్తులకు భిక్ష వడ్డన చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. అనంతరం స్వాముల తో తన పిల్లలతో కలిసి భిక్ష చేశారు... గత కొన్ని సంవత్సరాలుగా కుల మతాలకు అతీతంగా హనుమాన్ భక్తులకు భిక్ష ను ఏర్పాటు చేస్తున్న ఆటోడ్రైవర్ మహమ్మద్ సందాని ని గ్రామ ప్రజలు హనుమాన్ భక్తులు అభినందించారు.



## సల్లంగా చూడు పోచమ్మ తల్లో అంటూ గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు

**మండుటెండను సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**



**చిగురుమామిడి మే 22 (ప్రజామంటలు):** సల్లంగా చూడు పోచమ్మ తల్లో అంటూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ప్రతి గడప నుండి బోనాలు తీసుకొని శివసత్తుల పూనకాలు,డప్పు చప్పుల్ల మధ్య గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధి కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 23న శ్రీరేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా ఆలయం చుట్టూ బండ్లు తిరుగుట, 24న బోనాల జాతర జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు గట్టు మొగిలి, ఆకుల శ్రీనివాస్, కుల సంఘం నాయకులు తీగల శ్రీనివాస్, గట్టు కనకయ్య, బుర్ర రవి, గట్టు జనార్ధన్, సుధగోని శ్రీహరి, బోడిగ మోహన్, మార్క సత్తయ్య, గౌరవ అధ్యక్షుడు బుర్ర పరశురాం గౌడ్, గట్టు రాజయ్య, గట్టు ఎల్లయ్య, గట్టు రమేష్, మరియు యూత్ గౌడ సంఘం అధ్యక్షులు దుబాల వెంకటేష్, గట్టు మురళీ, బుర్ర సతీష్, అనగొని శ్రీనివాస్, ఆకుల అజయ్, గట్టు కిరణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీలలో సత్తా చాటిన జమ్మికుంట విద్యార్థులు

**విద్యార్థులను, కరాటే మాస్టర్ ను సన్మానించిన సినీ హీరో సుమన్**

**జమ్మికుంట మే 22 (ప్రజామంటలు):** ఈ నెల 19 వ తేదీన గోవా లోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియం లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో జమ్మికుంట కు చెందిన విద్యార్థులు ఎండి లిబాన్ బ్రౌన్ బెల్ట్ అండర్ 14 విభాగం లో టీమ్ కటాస్ లో బంగారు పతకం, స్పారింగ్ విభాగంలో కాంస్య పతకం మరియు కటాస్ విభాగంలో రజిత పతకం సాధించడం జరిగింది. జి. దరణేష్ పరుపుల్ బెల్ట్ విభాగం లో అండర్ 14 లో టీమ్ కటాస్ విభాగం లో బంగారు పతకం, కటాసు విభాగంలో కాంస్య పతకం మరియు జి. కార్తీక్ పర్పుల్ బెల్ట్ అండర్ 10 విభాగం టీమ్ కటాస్ విభాగం లో బంగారు పతకం , కటాసు విభాగం లో కాంస్య పతకం సాధించడం జరిగింది వీరికి సినీహీరో తల్వార్ సుమన్ గారి ఆధ్వర్యం లో పతకాలు అందజేయడం జరిగింది. సినీ హీరో సుమన్ మాట్లాడుతూ.... అంతర్జాతీయ విభాగంలో విజయం సాధించడం చాలా గొప్ప విషయం అని అభినందించారు విరి తల్లి తండ్రులను అభినందించాడు. ఈ రోజులల్లో కరాటే విద్య అందరికీ అవసరం అని అందరూ తప్పకుండా కరాటే ను నేర్చుకోవాలి అని మరియు కరాటే లో పెద ధనిక కుల మత భేదాలు లెవ్వు అని మన అందరికీ ఒకటే కరాటే అని అన్నారు.అలాగే జమ్మికుంట కు చెందిన విద్యార్థులు 3 బంగారు పతకాలు , 1 వెండి పతకం . 3 రజిత పతకాలు సాధించడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు అలాగే కరాటే మాస్టర్ యండి మహమూద్ గారిని బెస్ట్ కరాటే మాస్టర్ అని ప్రశంసిస్తూ టీమ్ చాంపియన్ ట్రోఫి ను అందజేయడం జరిగింది.యీ పోటీలకు 4 దేశాల నుంచి మాస్టర్స్ అండ్ స్టూడెంట్స్ రావడం జరిగింది సుమారు 1500 మంది పాల్గొనడం జరిగింది యిది రికార్డు టోర్నమెంట్ అని తల్వార్ సినీ హీరో సుమన్ గారు తెల్పడం జరిగింది. మన తెలంగాణాలో కరాటే కు ఒక మంచి పేరు జమ్మికుంట కు ఉంది అని తెలిపారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం

**సముదరంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరిక**

**విశాఖపట్టణం,మే22:** ఉపరితల ఆవర్తనం బలపడి అల్పపీడనంగా మారిందని, నైరుతి, పశ్చిమ బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉందని విశాఖపట్టణం వాతావరణ శాఖ అధికారి తెలిపారు. మరో రెండు రోజుల్లో ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని వివరించారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళొద్దని సూచించారు. వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై అంతగా ప్రభావం ఉండదని పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

## ఎట్టకేలకు పిన్నెల్లి పట్టివేత

**సంగారెడ్డి సమీపంలో గెస్ట్‌హౌజ్‌లో అరెస్ట్**



**హైదరాబాద్,మే22:** ఈవీఎంను ధ్వంసం చేసి, హింసాత్మక ఘటనలకు పాల్పడిన కేసులో మాచర్ల వైకాపా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముమ్మరంగా గాలించి సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇస్నాపూర్ లోకేషన్ గురించి మాచర్ల పోలీసులు.. పటాన్‌చెరు పోలీసుల సహకారం తీసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకోగలిగారు.పోలింగ్ రోజు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రెంటచింతల మండలం పాల్వాయిగేటు (పోలింగ్ కేంద్రం 202)లో ఈవీఎంను ధ్వంసం చేసిన ఎమ్మెల్యేపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐపీసీ కింద 143, 147, 448, 427, 353, 452, 120బి, ఆర్పీ చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదయ్యాయి. ఈనెల 20నే పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

## 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**సిద్దిపేట,మే22:** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పెద్దరాజుపేట గ్రామ శివారులో డీసీఎం ద్వారా అక్రమంగా తరలిస్తున్న 41 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చేర్యాల సీఐ శ్రీను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పెద్దరాజుపేట గ్రామ శివారులో నూనె వెంకట్ అనే వ్యక్తి డీసీఎంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. బియ్యం లోడ్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ స్వాధీనం కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు .ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసినా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాల పై పటిష్టమై నిఘా ఏర్పాటు చేశామని, చట్టవ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు

**హైదరాబాద్,మే22:** తెలంగాణలో మరో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 23న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

# దేవర చిత్రంలో అవకాశం ఓ అదృష్టం

## పాత్ర గురించి వివరించిన జాన్వీ కపూర్



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'దేవర' చిత్రంతో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దేవర'లో పాత్ర గురించి మాట్లాడారు. 'ఇందులో 'తంగం' పాత్ర పోషిస్తున్నాను. అది ఎంతో వినోదాత్మకంగా ఉంటుంది. ఇప్పటి వరకు చేసిన షూటింగ్ చాలా సరదాగా జరిగింది. సెట్‌లోని వారంతా నాపై ఎంతో ప్రేమగా ఉంటారు. చిత్రయూనిట్ అంకితభావానికి ఆశ్చర్యపోయాను. ఇది విభిన్నమైన కథ. అందంగా, ప్రత్యేకంగా ఉంటుంది. 'దేవర'లో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఇంత మంచి చిత్రంలో నటించే అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు' అని చెప్పారు. తాజాగా ఈ సినిమాలో తొలి పాటను విడుదల చేయగా దానికి మంచి ప్రేక్షకాదరణ లభించింది. త్వరలోనే రెండో పాట విడుదల చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. ఓ సందర్భంలో దర్శకుడు ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఆయన అభిమానులకు 'దేవర' ప్రత్యేకంగా నిలుస్తుందని చెప్పడంతో దీనిపై అంచనాలు రెట్టింపయ్యాయి. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తోన్న ఈ చిత్రంలో శ్రీకాంత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్ర మొదటి భాగాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. అయితే కొన్ని కారణాల వల్ల దీని విడుదలను అక్టోబర్ 10కి వాయిదా వేశారు.

# ఓటిటిలోకి అజయ్ దేవగణ్..మైదాన్

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మైదాన్ . ఇండియన్ లెజెండరీ ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు అమిత్ రవీంద్రనాథ్ శర్మ దర్శకత్వం వహించాడు.. జీ స్టూడియోస్ సంస్థ, బోనికపూర్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తూ.. ఎట్టకేలకు ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఇప్పుడు తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం రెంటల్ విధానంలో అందుబాటులోకి వచ్చింది. రూ.349కి ఈ సినిమాను ప్రైమ్ అందుబాటులో ఉంచింది. 1950-62 మధ్యకాలంలో ఫుట్‌బాల్ ఆటకు ఇండియాలో విపరీతమైన క్రేజ్ ఉండేది. అయితే ఫుట్‌బాల్ ఆటకు ఇంత ఆదరణ రావడానికి కారణం ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ. అతను కోచ్‌గా ఉన్నప్పుడే 1951,



1962లో భారత ఫుట్ బాల్ టీమ్ ఆసియా గేమ్స్ లో విజయం సాధించింది. ఇక అబ్దుల్ రహీమ్ కోచ్‌గా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాగా.. అబ్దుల్ రహీమ్ పాత్రలో అజయ్ దేవగణ్ నటించగా.. అతడి భార్య పాత్రలో ప్రియమణి నటించింది. ఇక ఈ సినిమాలో గజ్రాజ్ రావ్. రుద్రానిల్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

# తమిళ కమిడియన్ సూరి మూవీ ట్రైలర్ విడుదల



గతేడాది వచ్చిన విడుతలై పార్ట్-1 సినిమాతో హీరోగా మంచి గుర్తింపు సంపాదించాడు తమిళ స్టార్ కమెడియన్ సూరి . కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో సూరి నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా వచ్చాయి. కాగా ఈ మూవీ తర్వాత సూరి వరుస మూవీలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే విడుతలై పార్ట్-2 లో నటిస్తున్న సూరి తాజాగా మరో కొత్త సినిమాను విడుదలకు రెడీ చేశాడు. సూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం గరుడన్. ఈ సినిమాకు కాకీ స్టటై , కోడి,పట్టాస్ చిత్రాల ఫేమ్ దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. తమిళ నటుడు శశికుమార్, మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రేవతి శర్మ, శివత నాయర్ , బ్రిగుడ సాగ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు.ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. సూరి కూడా ఇప్పటివరకు ఎన్నడూ చూడని మాస్ అవతర్ లో కనిపిస్తున్నాడు.ఇక ఈ చిత్రాన్ని లార్క్ స్టూడియోస్ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీసంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సముద్రఖని, మొ÷-టటై రాజేంద్రన్, మైమ్ గోపి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఆర్థర్ ఎ విల్సన్ సినిమాటోగ్రఫీ చేయనుండగా.. ప్రదీప్ ఇ రాఘవ్ ఎడిటింగ్ నిర్వహించనున్నారు. కాగా ఈ చిత్రానికి వెట్రి మారన్ కథను అందిస్తుండగా.. యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు.

# అనుష్కతో సినిమా తీస్తా: నిర్మాత బషీద్



అనుష్క ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత ఎస్ కే బషీద్ తెలిపారు. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా 'అల్లరే అల్లరి' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఎస్ కే బషీద్.. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. తన కొత్త సినిమా విశేషాలను తాజాగా హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పు కొచ్చారు. అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో విజయేంద్రప్రసాద్ కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. ఆ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తానన్నారు.

# రొటీన్‌కు భిన్నంగా శ్రీవిష్ణు ..స్వాగ్




రొటీన్ సినిమాలకు భిన్నంగా తనకంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ విజయాలను అందుకుంటున్నాడు టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు. ఈ హీరో ప్రస్తుతం స్వాగ్ అనే సినిమాతో వస్తున్న విషయం తెలిసిందే. బోరింగ్ కథలకు టాటా చెబుతూ! సరికొత్త పంథాలో అచ్చ తెలుగు సినిమా అంటూ ఇప్పటికే గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఎగ్జైటింగ్ అప్‌డేట్‌లు త్వరలోనే ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తుండగా.. ఈ సినిమాకు హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా.. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పెళ్లి చూపులు ఫేమ్ రీతూ వర్మ కథానాయికగా నటిస్తుంది. జూలై మొదటి వారంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# చీరకట్టులో జాన్వీ అదుర్స్



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనమిచ్చారు. కంచి పట్టు చీర కట్టిన ఆ ముద్దుగుమ్మ.. తన అందాలతో ఆకర్షిస్తోంది. బ్లూ కలర్ శారీ కట్టుకున్న జాన్వీ.. ఆ పట్టు చీరపై క్రికెట్ డిజైన్ వేసుకున్నది. మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ ఫిల్మ్ కోసం వారణాసిలో ప్రమోషన్ చేస్తున్న ధడక్ గర్ల్.. చాలా వెరైటీ శారీలో తళుక్కుమన్నది. గంగా నది తీరంలో పడవపై వెళ్తూ ఆమె తన చీరలో దాగిన డిజైన్ వర్క్‌ను ప్రజెంట్ చేసింది. బ్లూ కలర్ చీరపై చేయితో నేసిన డిజైన్ వర్క్ ఆకట్టుకంటోంది. 1983 వరల్డ్ కప్ గెలిచిన సందర్భానికి చెందిన క్షణాలను ఆ చీరపై అత్యంత కళాత్మకంగా డిజైన్ చేశారు. మిరుమిట్లు గోలిపే స్టేడియంలో ఓ బ్యాటర్ భారీ సిక్స్ కొట్టినట్లు ఆ చీర డిజైన్‌లో చూపించారు. క్రికెటర్లు పవర్‌ఫుల్ షాట్లు ఆడుతున్నట్లు కూడా డిజైన్‌లో క్రియేట్ చేశారు. షార్ట్ స్లీవ్ బ్లౌజ్ వేసుకున్న జాన్వీ.. బ్యాక్‌లెస్ టై నాట్‌తో సంప్రదాయబద్ధంగా కనిపించింది. క్రికెట్ స్టోరీ నేపథ్యం ఉన్న చిత్రంలో నటిస్తున జాన్వీ.. ఆ కాన్సెప్ట్‌తో డిజైన్ చేసిన చీరలో తన ఫ్యాషన్ ట్యాలెంట్‌ను ప్రదర్శించింది.

# ఫ్యాన్స్ మధ్య చిచ్చు పెట్టిన సమంత పోస్ట్!



ఐపీఎల్-2024లో క్లైమాక్స్ ఫైట్ షురూ అయ్యింది. మంగళవారం నుంచి ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ప్రారంభయ్యాయి. అయితే హోరాహోరీగా సాగుతాయనుకుంటే క్వాలిఫయిర్-1 ఏకపక్షంగా మారింది. అహ్మదాబాద్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన తొలి క్వాలిఫయిర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో కేకేఆర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు ఘోర పరాజయాన్ని చవిచూసిన ఎస్ఆర్‌హెచ్ తుదిపోరు అర్హత సాధించాలంటే క్వాలిఫయిర్-2లో తప్పక నెగ్గాల్సి ఉంటుంది. కాగా, ఇవాళ మరో ఆసక్తికర పోరు జరగనుంది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. ఈ పోరులో గెలిచిన జట్టు ఫైనల్ బెర్తు కోసం రెండో క్వాలిఫయిర్-2లో సన్‌రైజర్స్‌తో పోటీపడాల్సి ఉంటుంది. అయితే ఐపీఎల్ ఆసక్తికరంగా సాగుతున్న వేళ ప్రముఖ నటి సమంత చేసిన ఓ పోస్ట్ నెట్టింటిని షేక్ చేస్తోంది. సమంత భావాన్ని అర్థం చేసుకోలేక నెటిజన్లు తమకు నచ్చిన ఊహాగానాలు మొదలుపెట్టారు. సమంత ఏ విషయాన్ని ఉద్దేశించిందో తెలియక తమ బుర్రలకు విపరీతంగా పనిచెబుతున్నారు. సమంత అసలేం పోస్ట్ చేసిందంటే.. 'మీరు విజయం సాధిస్తే చూడాలని ఉంది' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన సమంత దానికి క్యాప్షన్ ఇలా రాసుకొచ్చింది. "మీ హృదయం ఏది కోరుకున్నా, మీరు ఎలాంటి ఆకాంక్షలు కలిగి ఉన్నా, నేను మీ కోసం మద్దతు ఇస్తాను. మీరు విజయానికి అర్హులు" అంటూ మోటివేషనల్ క్యాప్షన్‌ను పోస్ట్‌కు జతచేసింది. అయితే సమంత పోస్ట్‌కు కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ ఆర్సీబీకి మద్దతు ఇస్తుందని కొందరు, ఎస్ఆర్‌హెచ్‌కు సపోర్ట్ చేస్తుందని మరికొందరు కామెంట్ బాక్స్‌లో వాదిస్తున్నారు. దీంతో ఆర్సీబీ-ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్ సమంత మాకంటే మాకు సపోర్ట్ చేస్తుందని గొడవ పడుతున్నారు. మరోవైపు ఇది క్రికెట్‌కు సంబంధించి కాదని, తన అభిమానుల కోసం సమంత చేసిన పోస్ట్ అని మరికొందరు తమ అభిప్రాయాలను చెబుతున్నారు. మరి, ఈ పోస్ట్‌పై స్పష్టత రావాలంటే సమంతనే క్లారిటీ ఇవ్వాలి. కాగా, అనారోగ్యం కారణంగా సమంత కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల మయోసైటిస్ నుంచి కోలుకోవడంతో తిరిగి నటనపై దృష్టి పెట్టారు. గత నెలలో తన పుట్టినరోజు సందర్భంగా కొత్త మూవీ 'మా ఇంటి బంగారం' గురించి అప్‌డేట్ ఇచ్చారు.

# 'సమయం ఆసన్నమైంది'..

## ధోని సంచలన పోస్ట్



ఐపీఎల్ 17వ సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ సర్దుకుంది. కీలక మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి 14 పాయింట్లతో ప్లేఆఫ్స్‌లో నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఓటమి కారణంగా చెన్నై ప్లేఆఫ్ కల అసంపూర్తిగా మిగిలిపోయింది. ప్లే ఆఫ్స్ లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్ మంగళవారం మే 21న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. మరికాసేపట్లో రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. అంతకు ముందు టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనీ ఫేస్‌బుక్‌లో ఓ పెద్ద ప్రకటన చేశాడు. సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్ గా ఉండని మిస్టర్ కూల్ ఫేస్ బుక్ లో 3 వాక్యాలను పోస్ట్ చేశాడు. ' విశ్రాంతి తీసుకోవడానికి ఇది సరైన సమయం. ముఖ్యమైన పనులు చేయడానికి ఇది అనువైన సమయం. నేను నా సొంత జట్టును ప్రారంభిస్తున్నాను!' అని ధోని రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ధోని ఏ ఉద్దేశంతో ఈ పోస్ట్ ను షేర్ చేశాడు? ఇప్పుడు ధోనీ కొత్త జట్టు ఏది? ఆ జట్టు క్రికెట్‌కు సంబంధించినదా లేక మరేదైనా ఉందా? దీనిపై క్రికెట్ అభిమానులు, ధోనీ అనుచరులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ధోనీ తీసుకున్న పలు నిర్ణయాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. అలాగే ధోని సోషల్ మీడియా పోస్ట్‌లలో దేనినైనా అలాగే అంచనా వేయడం తప్పు, ఎందుకంటే ధోనీ కూడా అలాంటి పోస్ట్‌ల ద్వారా ప్రమోషన్లు చేస్తున్నాడు. ధోనీ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తన సొంత జట్టును ప్రారంభిస్తున్నట్లు తెలిపాడు. అయితే ఈ జట్టు క్రికెట్‌కు సంబంధించినదా? లేదా ధోని %ఫూా%లో జట్టును తీసుకోబోతున్నాడా? అనే చర్చ జరుగుతోంది. మరోవైపు ధోనీ ఇంకేమైనా స్టార్ట్ చేసి తన టీమ్‌ని అక్కడికి తీసుకురావాల నుకుంటున్నాడా? అనే టాక్ కూడా ఉంది. ఇప్పుడు ధోనీ కొత్త జట్టు ఏది? అతను ధోనీ జట్టుకు కెప్టెన్ అవుతాడా లేక మరెవరైనా ఉంటారా? అంటూ అభిమానులు లెక్కలేసుకుంటునన్నారు . అయితే ధోని షేర్ చేసిన ఈ పోస్ట్‌కు అర్థం రానున్న రోజుల్లో తేలిపోతుందని అభిమానులు భావిస్తున్నారు. అందుకే అందరూ ధోని సోషల్ మీడియా అకౌంట్లపై ఓ కన్నేసి ఉంచుతున్నారు. కాగా, ఐపీఎల్ 17వ సీజన్‌కు ముందు మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుని రుతురాజ్ గైక్వాడ్‌కు పగ్గాలు అందించాడు. రీతురాజ్ నాయకత్వంలో చెన్నై 14 మ్యాచ్‌లకు గాను 7 గెలిచింది. మరో 7 మ్యాచుల్లో పరాజయం పాలై ప్లే ఆఫ్స్ కు చేరకుండానే నిష్క్రమించింది.

# రాజకీయ కుట్రలతో 150 కోట్లు సీజ్ చేయించారు

## రాజంపేట ఎంపి అభ్యర్థి బషీద్

**హైదరాబాద్,మే22:** పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఏపీ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నానని రాజంపేట కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బషీద్ అన్నారు. పార్టీ నన్ను గుర్తించి రాజంపేట పార్లమెంట్ సభ్యుడిగా టికెట్ ఇచ్చింది. నేను ప్రచారం చేసుకునేందుకు రాజంపేట వెళ్తే బీజేపీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి , ఇతర రాజకీయ నాయకులు నన్ను చాలా ఇబ్బందులు గురి చేశారు. నా అనుచరులందరినీ అపహరించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చాం. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయ ప్రత్యర్థిగా చూస్తూ ఇబ్బందులు పెట్టడం సరికాదు. నాకు ఐటీ నోటీసులు ఇప్పించి, 150 కోట్ల రూపాయలు సీజ్ చేయించారు. కోర్టులపై నాకు నమ్మకం ఉంది. న్యాయస్థానంలో వీటిని ఎదుర్కొంటాను. ఎవరెన్ని కుట్రలు చేసినా రాజంపేటలో నేను ఎంపీగా గెలవడం ఖాయం. అతి కొద్ది సమయమే అక్కడ క్యాంపెయిన్ చేశాను. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎంపీగా గెలిచి కాంగ్రెస్ పార్టీ, స్థానిక ప్రజలు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతాననే ఆత్మవిశ్వాసంతో ఉన్నానని ఎస్ కే బషీద్ చెప్పుకొచ్చారు.

# పిన్నెల్లి పారిపోతుంటే ఏం చేశారు

## పోలీసుల తీరుపై ప్రత్తిపాటి ఆగ్రహం

**పల్నాడు,మే22:** ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని విపక్షాలు ప్రశ్నించాయి. హౌస్ అరెస్ట్‌లో ఉండగా పిన్నెల్లి సోదరులు ఎలా తప్పించుకుంటారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నిలదీశారు. పిన్నెల్లి సోదరులు పారిపోతుండగా పోలీసులు ఏం చేస్తున్నారని అడిగారు. ఇంట్లో ఉన్న వారు తప్పించుకోవడం వీలవుతుందా..? అని ప్రశ్నించారు. నిజంగా పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని కోరారు. అలా కాకుండా లేరు, తప్పించుకున్నారని కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రతిపాటి పుల్లారావు అన్నారు. హింస చెలరేగినా అదుపులోకి తీసుకురావడంలో సీఎస్, డీజీపీ విఫలం అయ్యారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటలనకు వారు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేయడంతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించిందని గుర్తుచేశారు. సీఈసీ నుంచి ఆదేశాలు వస్తే కానీ అరెస్ట్ చేయాలనే స్పృహ రాష్ట్రంలోని అధికారులు, పోలీసులకు లేకపోవడం విచారకరమని ప్రతిపాటి పుల్లారావు అభిప్రాయ పడ్డారు. ఇవీఎం ధ్వంసం చేసిన ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చని ప్రతిపాటి పుల్లారావు అభిప్రాయ పడ్డారు. ఎమ్మెల్యే ఈవీఎం ధ్వంసం చేస్తే ఇన్ని రోజులు ఎందుకు ఉపేక్షించారని నిలదీశారు. ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనకుండా శాశ్వతంగా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

# ఎపిలో ఎన్నికల అక్రమాలతో ఆందోళన

**ఒత్తిడిలో ప్రభుత్వ ఉద్యోగులు**

**కౌంటింగ్ డ్యూటీ చేసేందుకు విముఖత**

**సెలవుల కోసం రిటర్నింగ్ అధికారులకు మొర ?**

**అమరావతి,మే22:** ఎపిలో ఎన్నికల అక్రమాలతో ఆందోళనలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారు. కౌంటింగ్ డ్యూటీ చేసేందుకు విముఖత చూపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సెలవుల కోసం రిటర్నింగ్ అధికారులకు మొర పెట్టుకున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన వైకాపా, పల్నాడు, నరసరావుపేట, అనంతపురం లోని తాడిపత్రి, తిరుపతిలో పెద్దఎత్తున వైసీపీ మూకలు హింసకు పాల్పడ్డారు. అలాగే వైసీపీ అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరి ఒత్తిళ్లు తట్టుకోలేక ఎన్నికల సంఘాన్ని రిటర్నింగ్ అధికారులు సెలవులు అడుగుతున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో డ్యూటీలు చేయలేమని అంటున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సమస్యాత్మక జిల్లాల నుంచి ఈసీకి రిటర్నింగ్ అధికారులు సెలవులు కావాలని విజ్ఞప్తులు పంపుతున్నారు. పోలింగ్ సమయం నుంచే ఈసీకి ఆర్వోలు విజ్ఞప్తులు చేస్తున్నారు. వైసీపీకి చెందిన అభ్యర్థుల అసభ్యకరమైన మాటలు వినలేకపోతున్నామని ఈసీకి ఫిర్యాదు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థుల ఒత్తిళ్లు ఈసీకి ఆర్వోలు నివేదిస్తున్నారు. కౌంటింగ్ రోజు వరకూ విధులు నిర్వహించే పరిస్థితి రాష్ట్రంలో లేదంటూ విజ్ఞప్తుల్లో ఈసీని రిటర్నింగ్ అధికారులు అభ్యర్థిస్తున్నారు. ఆర్వో బాధ్యతల నుంచి తప్పించాలంటూ ఈసీని రిటర్నింగ్ అధికారులు వేడుకుంటున్నారు. ప్రత్యేకించి రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి ఆర్వోలపై అధికార పార్టీకి చెందిన నేతలపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. అధికార పార్టీ నేతల నుంచి వస్తున్న బెదిరింపులతో భయాందోళనల్లో రిటర్నింగ్ అధికారులు ఉన్నారు. కేవలం ఐఏఎస్ అధికారులు మాత్రమే ఈ వత్తిళ్లను తట్టుకోగలరని ఎన్నికల సంఘాన్ని నివేదిస్తున్నారు.

# కారులోకి వెళ్లి బాలిక మృత్యువాత

**భద్రాద్రి కొత్తగూడెం,మే22:** మణుగూరు మండలం సాంబాయిగూడెంలో విషాదం చోటు చేసుకుంది. కారులో ఊపిరాడక మూడేళ్ల చిన్నారి కన్నుమూసింది. సాంబాయిగూడెంలో సాయి కుమార్, లిఖిత దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కల్మిష అనే మూడేళ్ల కుమార్తె ఉంది. మంగళవారం సాయంత్రం లిఖిత నిద్రపోతున్న సమయంలో కల్మిష ఆడుకుంటూ ఇంటి బయటకు వెళ్లింది. తోటి పిల్లలతో ఆడుకుంటూ అక్కడే ఉన్న ఓ కారులోకి ఎక్కింది. ఆ సమయంలో కారు డోర్లు పడి లాక్ అయిపోయాయి. దీన్ని మిగతా పిల్లలు గమనించలేదు. కారులో లాక్ అయిన కల్మిష.. మిగతా పిల్లలను చూస్తూ ఏడుస్తూ ఉంది. కానీ బయటకు రాలేకపోయింది. ఈ క్రమంలోనే స్పృహ లేకుండా కారులోనే పడిపోయింది. సాయంత్రం సమయంలో గాలి దుమారం వస్తుండటంతో తన పాప కోసం లిఖిత బయటకు వచ్చింది. కానీ పాప కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది చుట్టుపక్కల అంతా వెతికింది. ఇంతలో కారులో స్పృహ తప్పిన కల్మిష కనబడింది. కారు లాక్ తీసిన దంపతులు.. పాపను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు.

# చేసిన పనులు చెప్పుకోలేక ఓడాం

**- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారు -ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**నర్సంపేట,మే22** మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్- నల్లగొండ --ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే టెట్ పరీక్ష ఫీజు రూ. 20 వేలు చేస్తరని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఒక గళాన్ని మండలికి పంపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తా అన్నాడు. 50 వేలతో మెగా డీఎస్సీ అన్నాడు. ఈ రెండు అమలు కాలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నారు. అవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు. లీగల్ సమస్యల వల్ల ఆగిపోయాయి. కేవలం కాగితాలు ఇచ్చి తాను ఇచ్చానని ఊదరగొడుతున్నారు. విచక్షణ కలిగిన విద్యావంతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సమాజానికి దిక్సూచిగా ఉంటూ, దిశానిర్దేశం చేసేది మీరే.. మీరు కూడా మళ్లీ మోసపోతారా..? లేదా మేల్కొని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి అవకాశం ఇస్తారా..? ఆలోచించుకోవాలి. బీఆర్ఎస్ తరపున రాకేశ్ రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. రాకేశ్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టారని అన్నారు. తెల్లారి లేస్తే బూతులు తిట్టుడు, వెకిలి పనులు చేసుడు కాంగ్రెస్ అభ్యర్థి లక్షణం. దందాలు చేయడం, బెదిరించడం వంటి కేసులు నమోదైనట్లు కాంగ్రెస్ అభ్యర్థి అఫిడవిట్‌లో ఉన్నాయి. తీన్మార్ మల్లన్న అఫిడవిట్‌లో 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులు, అనుమతి లేకుండా అమ్మాయిల ఫోన్ నంబర్లను ఫేస్‌బుక్‌లో పెట్టిన కేసులు, బ్లాక్ మెయిల్ చేసిన కేసులు.. ఇలా 56 క్రిమినల్ కేసులు ఉన్న మహానుభావుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. కాబట్టి అభ్యర్థుల గుణగణాలు చూడాలి. మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించండి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నర్సంపేట యువత తరపున రేపు మండలిలో గల్లా పట్టి అడిగే పరిస్థితి మాత్రం ఉంటదని అన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడా అని ప్రభుత్వాన్ని నిలదీసే వాయిస్ ఉంటది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరు రైతు బిడ్డలుగా, విద్యావంతులుగా మోసాన్ని గ్రహించి ఓటేయకపోతే నష్టపోయేది మీరే. నోటిఫికేషన్లు ఇవ్వకపోపోయిన పట్టభద్రులు ఓటేశారు అని ప్రభుత్వం అనుకుంటది. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా మాకు ఓటేశారు అనుకుంటారు. ఒక్క పరీక్షకు కూడా ఫీజు ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ. 400 ఉండే. ఇప్పుడు రూ. 2 వేలు అయింది. మళ్లీ వాళ్లకు ఓటేస్తే టెట్ ఫీజు రూ. 20 వేలు చేయరా..? ఆలోచించండి. పదేండ్లలో తెలంగాణలో ఎంతో ప్రగతి సాధించాం. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలు గ్రామపంచాయతీలు అయ్యాయి. ఐటీ ఎగుమతులు పెరిగాయి. పరిశ్రమలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు.



# పెద్దల సభకు గౌరవాన్ని పెంచే విధంగా పట్టభద్రుల తీర్పు ఇవ్వాలి

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి



**హనుమకొండ మే 22 (ప్రజామంటలు):** పెద్దల సభకు గౌరవాన్ని పెంచే విధంగా పట్టభద్రుల తీర్పు ఇవ్వాలి అని కోరుతున్న భారత రాష్ట్ర సమితి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి. హనుమకొండ పట్టణంలోని వికలాంగుల వసతి గృహం అలాగే విన్నర్స్ , హరీష్, జీనియస్ అకాడమిల్లో ప్రచారంలో పాల్గొని పట్టభద్రులను ఓటు అభ్యర్థించిన రాకేష్ రెడ్డి. ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొన్న కె.యు బి.ఆర్.ఎస్.వి విద్యార్థి నాయకులు హనుమకొండ, వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా భారత రాష్ట్ర సమితి బలపర్చిన అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు.మూడు జిల్లాలో సుడిగాలి పర్యటనలో తీరిక లేని సమయం గడుపుతున్న రాకేష్ రెడ్డి ఈరోజు ఉదయం వికలాంగుల వసతి గృహం, పలు స్టడి సెంటర్లు, కోచింగ్ అకాడమీలో పట్టభద్రులతో మమేకమవుతు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తమ సోదరుడిగా శాసన మండలికి పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.పట్టభద్రులు విజ్ఞతతో పెద్దల సభ గౌరవాన్ని కాపాడే విధంగా ఒక విద్యావంతుడిగా యువ నాయకత్వానికి మీరందరు అండగా ఉండాలని ఆయన కోరారు.ఈరోజు పోటీలో ఒక రాజకీయ స్వార్థపరుడు, ఎలాగైనా చట్ట సభల్లో అడుగుపెట్టాలని కుట్ర చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని రాజకీయాల నుంచి వెలివేయలని కోరారు.గెలిపిస్తే శాసన మండలికి పోతా, మీరు ఓడిస్తే స్మశానానికి పోతానని మాట్లాడే రాజకీయ బ్లాక్మెలర్ తీన్మార్ మల్లన్న కావాల్నా, తన వేతనాన్ని నిరుద్యోగుల సంక్షేమ నిధిగా ఏర్పాటు చేస్తామన్న విద్యావంతుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీ గా కావాల్నా ఆలోచించి ఓటేయలని కాకతీయ యూని వర్సిటీ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు, పరిశోధక విద్యార్థులు పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర సీనియర్ విద్యార్థి నాయకులు డా. పాలమాకుల కొమురయ్య, యూనివర్సిటీ బిఆర్ఎస్వి ఇంచార్జి జెట్టి రాజేందర్, కందికొండ తిరుపతి, పిన్నింటి విజయ్ కుమార్, కొమురం సిద్ధు, రాజశేఖర్, రేవంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న టూరిస్ట్ బస్సు

## ఇద్దరు మహిళా భక్తులు దుర్మరణం

**చండీఘడ్,మే22:**పంజాబ్‌లోని లూథియానా సమీపంలోని సమ్రాలా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇక్కడి చహేలా గ్రామంలో ఉదయం భక్తులతో నిండిన టూరిస్ట్ బస్సు హైవేపై ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది.దీంతో బస్సులో ఉన్న ఇద్దరు మహిళా భక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, 15 మందికి పైగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అనంతరం క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతులు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన మీనాక్షి (51), సరోజబాల (54)గా గుర్తించారు.ఇండోర్‌లో నివసించే రిషబ్ మాట్లాడుతూ.. మేము ఇండోర్ స్థానికులమని, బస్సులో కేదార్‌నాథ్‌కు వెళ్తున్న వారంతా రైతు కుటుంబానికి చెందినవారని చెప్పారు. ప్రజలందరూ చార్ధామ్‌లో ఉన్న కేదార్‌నాథ్‌ను సందర్శించడానికి వెళ్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు మేము హరిద్వార్ నుండి అమృత్‌సర్‌కు బయలుదేరాము. ప్రమాదం జరిగిన వెంటనే ఒక్కసారిగా కలకలం రేగింది. దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు ప్రతి సంవత్సరం చార్ధామ్ యాత్రకు వెళతారు. ఉత్తరాఖండ్ చార్ధామ్ యాత్రకు ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. గత 10 రోజుల్లో ఏడు లక్షల మందికి పైగా భక్తులు నాలుగు క్షేత్రాలను దర్శించుకున్నారు. అయితే ఈసారి ప్రభుత్వం, అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. తీర్థయాత్రకు వచ్చిన పలువురు భక్తులు దేవుడిని దర్శించుకోకుండానే తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. ఛార్ధామ్ తీర్థయాత్ర కోసం పరిపాలన తాత్కాలిక నమోదు ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే ఇప్పటివరకు దాదాపు నాలుగు వేల మంది భక్తులు రిషికేశ్ నుండి ఇంటికి తిరిగి వచ్చారు. ఉత్తరాఖండ్‌కు చేరుకున్నా పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోలేకపోవడం దురదృష్టకరమని తిరిగి వచ్చిన యాత్రికులు తెలిపారు.

# మోడీకి సరితూగే వ్యక్తి దేశంలో లేరు

**- అసాధ్యం అనుకున్నవన్నీ సుసాధ్యం చేశారు**

**- పివోకెను కలుపుకోవడానికి ప్లాన్ సిద్ధం - రాజ్యసభ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్**



**నల్లగొండ,మే22:** ప్రధాని మోడీకి సరితూగే వ్యక్తి దేశంలోనే లేరని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. అసాధ్యమైన పనులను సుసాధ్యం చేసిన నాయకుడు మోదీ అని కొనియాడారు. కాశ్మీర్ లాల్ చౌక్ లో రాహుల్, ప్రియాంక స్వేచ్ఛగా తిరిగేలా చేశారని చెప్పారు. తూటాలతో ఉండే కాశ్మీర్ నేడు లక్షలాది మంది పర్యాటకులతో సందడిగా మారిందంటే దానికి మోదీ కారణమన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో కలపడానికి మోదీ యాక్షన్ ప్లాన్ రెడీ చేశారని చెప్పారు. బీఆర్ఎస్ వ్యతిరేకతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు లక్ష్మణ్. గ్యారెంటీలు, ఉచితాల పేరు మీద మనం కట్టిన పన్నుల డబ్బులను వృథా చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోలులో జరిగిన అవినీతి పై రేవంత్ సర్కార్ ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. యాదాద్రి జిల్లాలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వ్యతిరేకతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని లక్ష్మణ్ అన్నారు. గ్యారెంటీ లు, ఉచితల పేరు మీద మనం కట్టిన పన్నుల డబ్బులను వృధా చేస్తున్నారని, కేసీఆర్ వేల కోట్లు దోచుకొని రేవంత్ రెడ్డి కి చిప్ప చేతికి ఇస్తే ఆ చిప్ప పట్టుకొని పదహారు వేల కోట్లు అప్పు తెచ్చిదన్నారు లక్ష్మణ్. అంతేకాకుండా.. ఢిల్లీకి రెండు వేల కోట్ల రూపాయల కప్పం కట్టిన రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం, విద్యుత్ మీద జరిగిన అవినీతి పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను భారత్ లో కలపడానికి మోడీ యాక్షన్ ఎ÷-లాన్ అని ఆయన అన్నారు. ఇకపోతే నల్లగొండ బీజేపీ కార్యాలయంలో బీజేపీ నేత, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ గాలికి వదిలేసిందని ఆమె అన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఏమైందో కాంగ్రెస్ నేతలు చెప్పాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పాలనలో పాలనరాహిత్యం అవగాహన రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం లేదు.. గెలిపిస్తే ప్రయోజనం కూడా లేదన్నారు డీకే అరుణ. నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలు తెలిసిన ఏకైక వ్యక్తి బీజేపీ అభ్యర్థి అని, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి బిజెపి అభ్యర్థి విజయమే పరిష్కారమన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com